


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెడ్నెగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 146 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ మంగళవారం 17 ఫిబ్రవరి 2026 పేజీలు : 12 వెల : 2/-



## ఏపీలో టెక్ పాలన గ్రేట్

• ఆర్టీజీఎస్ సందర్శన అనంతరం బిల్ గేట్స్ వ్యాఖ్య • డేటాలేక్, సంజీవని, అమరావతి ప్రాజెక్టుల గురించి గేట్స్‌కు వివరించిన సీఎం

• ప్రజల జీవితాల్లో ఆర్టీజీఎస్ మార్పు తెస్తోందన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టెక్నాలజీతో అందిస్తున్న పాలన అద్భుతంగా ఉందని గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ వ్యాఖ్యానించారు. సోమవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఉన్న రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి సందర్శించిన బిల్ గేట్స్ అక్కడ డిస్ ప్లే వాల్స్‌పై ప్రదర్శించిన ప్రజంటేషన్లను తిలకించారు. ఆర్టీజీఎస్ నుంచి పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని ఆసాంతం పరిశీలించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ ద్వారా పౌర సేవల్ని వేగంగా అందిస్తున్న తీరు, ఫలితాలను గేట్స్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ముందుగా రాష్ట్రంలోని డేటా లేక్ వ్యవస్థ ద్వారా అన్ని ప్రభుత్వ విభాగాలనూ అనుసంధానించామని తద్వారా వేగంగా నిర్ణయాలు తీసుకోగలుగుతున్నామని తెలిపారు. డేటాలేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్స్, సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డులు, అమరావతి రాజధాని అంశాలపై అధికారులు బిల్ గేట్స్‌కు డిస్ ప్లే వాల్స్ ద్వారా ప్రజెంటేషన్ ఇచ్చారు. అవేర్ 2.0 ద్వారా రియల్ టైమ్‌లో సమాచారాన్ని సేకరించి దానిని ప్రజలకు వేగంగా అందిస్తున్నట్టు తెలియచేశారు. 42 రకాల సమాచారాన్ని ప్రజలకు, రైతులకు అందించటం ద్వారా తక్షణం స్పందించేందుకు ఆస్కారం కలుగుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరసేవల్ని కూడా సులభతరం చేశామని...ప్రజల చేతుల్లోకి 921 సేవలను తీసుకెళ్లామని మిగతా .. 2లో..

ఏఐ సమ్మిట్..

## భారత్ వేగవంతమైన వృద్ధికి నిదర్శనం

ప్రధాని నరేంద్ర మోదీ హర్షం



**విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ రాజధాని ఢిల్లీలోని భారత్ మండపంలో ఏఐ ఇంపాక్ట్ సమిట్‌ను నిర్వహిస్తుండడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఏఐ ఇంపాక్ట్ సమిట్‌లో పాల్గొనాల్సిందిగా ప్రపంచ దేశాలకు ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచ దేశాలకు భారత యువత ప్రతిభ, సామర్థ్యం తెలుస్తాయని.. ప్రపంచ అభివృద్ధిలో భారత్ తన సహకారాన్ని మరింత పెంచుకునేందుకు ముందడుగు వేస్తోందన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో భారత్ వేగంగా వృద్ధి చెందుతుందనడానికి ఈ కార్యక్రమం నిదర్శనమన్నారు. గ్లోబల్ సౌత్‌లో నిర్వహిస్తున్న ఈ మొదటి ప్రధాన అంతర్జాతీయ ఏఐ సమిట్ మన దేశంలో మిగతా .. 2లో..

## దేవాలయంలో హత్య..

నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష



**గౌతంనగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సిద్ధివినాయక దేవస్థానంలో 2022లో జరిగిన మహిళ హత్య కేసుకు సంబంధించి న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన పూజారి అనుముల మురళీకృష్ణకు కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. ఆలయానికి వచ్చిన 57 ఏళ్ల మహిళలను బంగారు మిగతా .. 2లో..

అన్నదాతలకు ఏఐ,

## అగ్రిటెక్ సేవలు అత్యద్భుతం

వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన బిల్ గేట్స్ - సాగులో యాప్, డ్రోన్ల వినియోగం పరిశీలన

సీఎం చంద్రబాబుకు, బిల్ గేట్స్‌కు రైతుల ఆత్మీయ స్వాగతం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** వ్యవసాయ రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న సాంకేతిక వినియోగం, ఏఐ ఆధారిత రైతు సేవలను గేట్స్ ఫౌండేషన్ చైర్మన్ బిల్ గేట్స్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఉండవల్లి కరకట్ట సమీపంలోని

ఇజ్రాయెల్ టూరిస్ట్‌పై

## సామూహిక అత్యాచారం..

ముగ్గురికి మరణశిక్ష

**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇజ్రాయెల్ టూరిస్ట్ సహా ఇద్దరు మహిళలపై అత్యాచారం, మరో పర్యాటకుడి మృతికి కారణమైన ముగ్గురికి మరణశిక్షపడింది. కర్ణాటక రాష్ట్రం కొప్పళ జిల్లా కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. కేసు వివరాలివీ.. గతేడాది మార్చి నెలలో కొప్పళ జిల్లాలోని తుంగభద్ర ఎడమకాలువ సమీపంలో చోటుచేసుకున్న ఈ ఘటనలు సంచలనం సృష్టించాయి. "ఇజ్రాయెల్‌కు చెందిన ఓ మహిళ(27), అమెరికాకు చెందిన డేనియల్ (23), నాసిక్‌కు చెందిన పంకజ్ (43), ఒడిశాకు చెందిన మిగతా .. 2లో..

పెళ్లికి ముందే లైంగిక సంబంధంలోకి

## ఎలా వెళ్తారో? : సుప్రీంకోర్టు



**విశ్వం వాయిస్ న్యూస్ :** పెళ్లికి ముందు శారీరక సంబంధాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఓ అత్యాచార కేసు విచారణ సందర్భంగా జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం మాట్లాడుతూ.. ఓ బంధాన్ని ఏర్పరచుకునే విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఓ వ్యక్తి గురించి పూర్తి వివరాలు తెలియకుండా పెళ్లికి ముందే లైంగిక సంబంధంలోకి ఎలా వెళ్తారని ప్రశ్నించింది. వివాహానికి ముందు శారీరకంగా కలవాల్సిన మిగతా .. 2లో..

నిజామాబాద్ అభివృద్ధికి

## కట్టుబడి ఉన్నాం

మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



**నిజామాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నిజామాబాద్ నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. అందుకోసం నిధులు ప్రత్యేక కేటాయించనున్నట్లు చెప్పారు. నిజామాబాద్‌లో ఎంఐఎంతో కలిసి కాంగ్రెస్ మేయర్ పీఠాన్ని దక్కించుకున్న సంగతి తెలిసిందే. మేయర్‌గా ఉమారాణి, డిప్యూటీ మేయర్‌గా సల్మా తహసీన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి ఉత్తమ్ మీడియాతో మిగతా .. 2లో..

కిమ్ రాజ్యంలో

## 'అత్తాకోడళ్ల' పోరు తప్పదా..?



**విశ్వం వాయిస్ న్యూస్ :** నిరంకుశ పాలనకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే కిమ్ రాజ్యంలో కుటుంబ పోరుకు తెర లేచిందా? అధికార పగ్గాల కోసం అత్తా కోడళ్లు పోటీ పడనున్నారా? ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే ఇలాంటి ప్రశ్నలే ఎదురవుతున్నాయి. ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ తన వారసత్వ పగ్గాలను 13 ఏళ్ల తన కుమార్తె కిమ్ జు యేకు అప్పగించే అవకాశం ఉన్నట్లు ఇటీవల దక్షిణ కొరియా స్పై ఏజెన్సీ వెల్లడించింది. అదే జరిగితే కిమ్‌కు తన సోదరి నుంచి సవాలు ఎదురయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**కుమార్తెకు పట్టం..**

కిమ్ జోంగ్ ఉన్ తన రాజకీయ వారసురాలిగా కుమార్తె కిమ్ జు యేను ప్రకటించే అవకాశాలున్నట్లు దక్షిణ కొరియా నిఘా సంస్థ నేషనల్ ఇంటెలిజెన్స్ సర్వీస్(ఎన్ఐఎస్) అంచనా వేసింది. ఈ నెలాఖరులో కిమ్‌కు చెందిన వర్కర్స్ పార్టీ సదస్సు జరగనుంది. ఇదే వేదికగా ఆయన తన వారసత్వ ప్రణాళికలకు పార్టీ పరంగా ఆమోదముద్ర వేసుకునే అవకాశం మిగతా .. 2లో..

## కాంగ్రెస్‌లో కొనసాగడంపై ఆలోచిస్తున్నా : జీవన్ రెడ్డి



**మేడిపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పార్టీలో కొనసాగడంపై ఆలోచిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్ ఏంటో గోచరించడం లేదని, అవమానాలు ఇంకెంతకాలం భరించాలని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గాల మధ్య విభేదాలు తలెత్తిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకున్నప్పటికీ.. చైర్మన్ పదవి ఎవరికి ఇస్తారన్న దానిపై ప్రతిష్టంభన మిగతా .. 2లో..

## మార్చి 3న శ్రీవారి ఆలయం మూసివేత : తితిదే



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** చంద్రగ్రహణం నేపథ్యంలో మార్చి 3న ఉదయం 9 గంటలకు తిరుమల శ్రీవారి ఆలయం మూసివేయనున్నట్లు తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి వెల్లడించారు. ఆ రోజు మధ్యాహ్నం 3.20 నుంచి సాయంత్రం 6.47 వరకు గ్రహణం ఉంటుందని చెప్పారు. అదే రోజు కుమారధార తీర్థ ముక్కోటి ఉత్సవాలు జరుగుతాయని, వాటికి తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

**18న మే నెల శ్రీవారి ఆర్జిత సేవల టికెట్ల విడుదల**

భక్తుల సౌకర్యార్థం 2026 మే నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవలు (సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ) టికెట్లకు మిగతా .. 2లో..

రూ.400 కోట్ల దారిదోపిడీ..

## అంతా కట్టుకథే



**విశ్వం వాయిస్ న్యూస్ :** ట్రక్కు నుంచి రూ.400 కోట్లమేర నగదు దారి దోపిడీ జరిగిందంటూ ఓ వాహన డ్రైవర్ మహారాష్ట్రలో చేసిన ఫిర్యాదు ఇటీవల కలకలం రేపింది. పొరుగునే ఉన్న కర్ణాటకలో ఇది రాజకీయ దుమారానికి కారణమైంది. అయితే.. ఇదంతా కట్టుకథేనని, అలాంటి ఘటనేదీ జరగలేదని మహారాష్ట్ర నాసిక్ పోలీసులు స్పష్టం చేశారు. నగదు తరలిస్తున్న ట్రక్కులో దోపిడీ జరిగిందంటూ డ్రైవర్ సందీప్ పాటిల్ గతేడాది డిసెంబరు 17న నాసిక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతేడాది అక్టోబరు 22న కర్ణాటక బెల్గాం జిల్లాలోని మిగతా .. 2లో..

రష్యా చమురు కొనమని

## భారత్ హామీ ఇచ్చింది : అమెరికా



**విశ్వం వాయిస్ న్యూస్ :** చమురు దిగుమతి విషయంలో జాతీయ ప్రయోజనాలే తొలి ప్రాధాన్యమని భారత్ పునరుద్ఘాటిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకూడదన్న విషయానికి కట్టుబడి ఉంటామని తెలిపిందన్నారు. జర్మనీలోని మ్యూనిక్‌లో జరిగిన భద్రతా సదస్సులో మాట్లాడిన ఆయన.. భారత్ గురించి మరోసారి ప్రస్తావించారు. వాణిజ్య ఒప్పందం గురించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల మాట్లాడుతూ.. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోకుండా ఉండేందుకు భారత్ అంగీకరించినట్లు ప్రకటించారు. ఆ తర్వాత అనేకసార్లు అగ్రరాజ్యం పలు సందర్భాల్లో ఇదే ప్రకటన చేసింది. ఈ క్రమంలోనే భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై విధించిన 25శాతం అదనపు సుంకాలను వెనక్కి తీసుకునే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను ఆయన జారీ చేశారు.

శిక్ష పూర్తయిందంటూ పిటిషన్..

## అబూ సలేంకు 'సుప్రీం'లో చుక్కెదురు



**విశ్వం వాయిస్ న్యూస్ :** ముంబయిలో 1993 నాటి పేలుళ్ల కేసులో దోషిగా తేలిన గ్యాంగ్‌స్టర్ అబూ సలేంకు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో తనకు విధించిన 25 ఏళ్ల శిక్షాకాలం ఇప్పటికే పూర్తయ్యిందని, 10 నెలలుగా అక్రమంగా కస్టడీలో ఉంచారని ఆరోపిస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం తిరస్కరించింది.

**కేసు పూర్వాపరాలు..**

సత్ప్రవర్తనకు సంబంధించిన రెమిషన్‌ను కలుపుకొని తాను ఇప్పటికే 25 ఏళ్ల జైలు శిక్ష అనుభవించానని, విడుదల చేయాలని కోరుతూ అబూ సలేం గతంలో బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. అయితే, అతడికి మధ్యంతర ఉపశమనం ఇచ్చేందుకు హైకోర్టు గతేడాది జులైలో నిరాకరించింది. 25 ఏళ్లు ఇంకా పూర్తి కాలేదని మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# భారత్ వేగవంతమైన వృద్ధికి నిదర్శనం

జరుగుతుండడం గర్వకారణమన్నారు. "సర్వజన హితాయ, సర్వజన సుఖాయ" (అందరికీ సంక్షేమం, అందరికీ ఆనందం) అనే ఈ సదస్సు థీమ్‌పై మోదీ మాట్లాడుతూ.. ప్రపంచదేశాల పురోగతి కోసం కృత్రిమ మేధస్సును ఉపయోగించుకోవడంలో మన ఉమ్మడి నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. ఈ సమిట్ వల్ల డిజిటల్ సదుపాయాల కల్పన, శక్తిమంతమైన స్టార్టప్‌ల ఏర్పాటు, అత్యాధునిక పరిశోధనలు వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భారత్ బాధ్యత మరింత పెరగనుందన్నారు. ఇప్పటికే ఆరోగ్య సంరక్షణ, విద్య, వ్యవసాయం, పాలన వంటి అనేక రంగాల్లో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. నేటినుంచి 20వ తేదీ వరకు దిల్లీలో జరగనున్న ఈ సదస్సుకు 45కు పైగా దేశాల ప్రతినిధులు హాజరుకానున్నారు. ఆయా దేశాలు తమ ఏఐ అజెండాలను నిర్వచించుకోనున్నాయి. మన ప్రతిభను ప్రదర్శించడం, డిజిటల్ పబ్లిక్ మౌలిక సదుపాయాలను విస్తరించడం, విస్తృతం అవుతున్న అంకుర సంస్థల పర్యావరణ వ్యవస్థను ప్రపంచానికి పరిచయం చేయడం ఈ సదస్సు ఉద్దేశం.

# దేవాలయంలో హత్య..

ఆభరణాల కోసం నిందితుడు హత్య చేసినట్లు దర్యాప్తులో బయటపడింది. ఈ కేసు విచారణ చేపట్టిన న్యాయమూర్తి కిరణ్ కుమార్ నిందితుడిని దోషిగా నిర్ధరిస్తూ.. యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. ఈ తీర్పుతో బాధిత కుటుంబానికి న్యాయం జరిగిందని పోలీసులు తెలిపారు.

# అగ్రిటెక్ సేవలు అత్యద్భుతం

వ్యవసాయ క్షేత్రాన్ని సోమవారం సందర్శించిన గేట్స్‌కు రైతుల్లో సాంకేతిక వినియోగాన్ని పెంచే కార్యక్రమాలపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు వివరించారు. వ్యవసాయం-అనుబంధ రంగాల్లో దిగుబడి పెంపు, సాగు ఖర్చు తగ్గింపుపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను తెలిపారు. అలాగే నాణ్యమైన పంట ఉత్పత్తుల ఎగుమతులకు ప్రత్యేక కార్యాచరణ అవలంభించి రైతులకు అధిక ఆదాయం వచ్చేలా ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు రైతు సేవా కేంద్రాల్లో అనలిటిక్స్, మానిటరింగ్ డాష్‌బోర్డులు వినియోగిస్తున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా మహిళా రైతులు మణి, అన్నపూర్ణ... ఇటీవల ముఖ్యమంత్రి ప్రారంభించిన ఏపీఏఐఎంఎస్ రైతు యాప్ గురించి గేట్స్‌కు తెలియజేశారు. ఈ యాప్ ద్వారా ఏ పంటలు పండించాలి, సాగునీటి నిర్వహణ, నేల స్వభావం, ధరలు, మార్కెట్ సమాచారం, పురుగు మందుల నియంత్రణ వంటి విషయాలు సులభంగా తెలుసుకుంటున్నామని చెప్పారు. ఏఐ ద్వారా పంట తెగుళ్ల గుర్తింపు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, అలాగే డ్రోన్ సేవలు పొంది పురుగు మందులను వినియోగిస్తున్న తీరును తెలిపారు. బిల్ గేట్స్ సమక్షంలోనే రైతులు ఏఐ టూల్ ఉపయోగించి, వ్యాధి సోకిన మొక్క ఫోటో తీసి అప్లోడ్ చేశారు. ఆ వ్యాధిని ఏఐ గుర్తించి నివారణ సూచనలు అందించింది. అనంతరం డ్రోన్ సేవను బుక్ చేయగా, మొక్కకు వ్యాధి వ్యాపించిన చోట డ్రోన్ స్ప్రే చేసింది. ఇది స్వయంగా చూసిన బిల్ గేట్స్... రైతులకు ఏఐ-అగ్రి టెక్ సేవలు అత్యద్భుతంగా అందిస్తున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశంసించారు. మరోవైపు స్థానిక రైతులతో బిల్ గేట్స్ ముఖాముఖి చర్చించారు. మొదటగా వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న ముఖ్యమంత్రి, బిల్ గేట్స్‌కు మహిళా రైతులు ఆత్మీయంగా స్వాగతం పలికారు. వారు స్వయంగా వండి తీసుకుచ్చిన స్థానిక వంటలను బిల్ గేట్స్ రుచి చూశారు. ఈ సందర్భంగా సేంద్రీయ సాగు పద్ధతులతో పండించిన ఉత్పత్తులను బిల్ గేట్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సామూహిక అత్యాచారం..

డిబాస్(42) ఆనెగుందిలోని ఓ హోంస్టేలో బసచేశారు. ఆ సమయంలో రాత్రి సమయంలో హోంస్టే నిర్వాహకురాలితో సహా పర్యాటకులందరూ కలిసి సణాపుర చెరువు సమీపంలోని రంగాపుర గంగమ్మ గుడివద్ద సంగీత కార్యక్రమం నిర్వహించారు. వారివద్దకు మద్యంమత్తులో ఉన్న ముగ్గురు వ్యక్తులు వచ్చి డబ్బు డిమాండ్ చేశారు. వారు ఇవ్వకపోవడంతో అక్కడున్న ఇద్దరు మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించారు. దాంతో వారిని డేనియల్, పంకజ్, డిబాస్ అడ్డుకున్నారు. వెంటనే నిందితులు వారిని తుంగభద్ర ఎడమ కాల్వలోకి తోసి, ఇద్దరు మహిళలపై అత్యాచారానికి పాల్పడ్డారు. కాల్వలో పడిన డేనియల్, పంకజ్ కొద్దిసేపటికి ఈదుకుంటూ ఒడ్డుకు వచ్చారు. మునిగిపోయిన డిబాస్ మృతిచెందారు" అని అప్పట్లో పోలీసులు వెల్లడించారు. ఆ తర్వాత హత్య, అత్యాచారాలకు కారకులైన మల్లేశ్ అలియాస్ హండిమళ్ల, సాయి, శరణప్పలను అరెస్టు చేశారు. ఈ ఘటనలపై కొప్పళలోని సెషన్స్ కోర్టులో విచారణ జరిగింది.

# పెళ్లికి ముందే లైంగిక సంబంధంలోకి ఎలా వెళ్తారో? : సుప్రీంకోర్టు

అవసరమేముందని జస్టిస్ బీవీ నాగరత్న బాధితురాలిని ప్రశ్నించారు. యువతులు కానీ, యువకులు కానీ వివాహానికి ముందు ఎవరూ ఎవరినీ నమ్మకూడదంటూ హితవు పలికారు. "బహుశా మనం పాతకాలపు వాళ్లమే కావచ్చు... కానీ పెళ్లికి ముందు, ఒక అబ్బాయి, అమ్మాయి అపరిచితులు. వారి బంధం ఎంత బలంగా ఉన్నప్పటికీ.. వివాహానికి ముందు శారీరక సంబంధంలోకి ఎలా వెళ్లగలుగుతున్నారో అర్థం కావట్లేదు" అని జస్టిస్ బీవీ నాగరత్న వ్యాఖ్యానించారు. ఈ కేసు తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు.

### కేసు ఏమిటంటే?

ప్రాసిక్యూటర్ తెలిపిన వివరాల ప్రకారం.. 2022లో ఓ మ్యాట్రిమోని ద్వారా ఓ యువతికి ఓ యువకుడు పరిచయం అయ్యాడు. అనంతరం పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. కొంతకాలం తర్వాత అతడికి అప్పటికే రెండు వివాహాలు అయినట్లు తెలుసుకున్న యువతి ప్రశ్నించగా ప్రైవేటు వీడియోలు బయటపెడతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా..అత్యాచారం కేసు నమోదు చేశారు. ఈ కేసులో బెయిల్ కోరుతూ నిందితుడు వేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది.

# నిజామాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మాట్లాడారు. రహదారులు, అభివృద్ధి విషయంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వబోతోందని చెప్పారు. తెలంగాణలో నిజామాబాద్ ఓ గొప్ప నగరంగా అభివృద్ధి చెందాలని, కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు కృషి చేస్తుందని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

# రూ.400 కోట్ల దారిదోపిడీ.. అంతా కట్టుకథే

చోర్లా ఘాట్ ప్రాంతంలో ఈ ఘటన జరిగిందని చెప్పాడు. ఏడుగురు వ్యక్తులు అడ్డగించి, కిడ్నాప్ చేసి, దాడి చేశారని ఆరోపించాడు. ఆపై రూ.400 కోట్ల విలువైన రెండువేల నోట్లతో (ప్రస్తుతం చలామణిలో లేవు) పరారైనట్లు తెలిపాడు. పోలీసులు ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. ఘటనాస్థలం కర్ణాటకలో ఉండటంతో.. ఆ రాష్ట్ర పోలీసులు అప్రమత్తమయ్యారు. అయితే, ఇదంతా అబద్ధమని దర్యాప్తులో తేలినట్లు మహారాష్ట్ర పోలీసులు తాజాగా వెల్లడించారు. "కర్ణాటక నుంచి మహారాష్ట్రకు హవాలా సొమ్ము తరలిస్తున్నట్లు ట్రక్కు డ్రైవర్ తెలిపాడు. దారి దోపిడీ గురించి సోషల్ మీడియాలో వీడియోలు కూడా అప్‌లోడ్ చేశాడు. అతడి ఫిర్యాదు మేరకు ఏడుగురిని అరెస్టు చేశాం. అయితే.. అతడు చేసిన ఆరోపణలు, ట్రక్కు రూట్, టైమింగ్స్, కాల్ రికార్డులు అన్ని కట్టుకథలేనని తేలాయి" అని తెలిపారు. మరోవైపు.. ఈ కేసులో అరెస్టయిన ఏడుగురినీ ఇగత్‌పురి కోర్టు విడుదల చేసింది. ఇది ఎన్నికల్లో పంచేందుకు తరలిస్తున్న సొమ్మేనని గతంలో కాంగ్రెస్, భాజపాలు పరస్పరం నిందించుకోవడం.. కర్ణాటకలో రాజకీయంగా వేడి రాజేసింది. ఈ ఘటనపై కర్ణాటక హోంమంత్రి జి.పరమేశ్వర్ కూడా స్పందించారు. కేసు దర్యాప్తులో మహారాష్ట్ర పోలీసులు కోరితే సహకరిస్తామన్నారు. అంత సొమ్ము తరలిస్తున్నట్లు తమకు సమాచారముంటే, పోలీసు భద్రత కల్పించేవారమని మరో మంత్రి ఎంబీ పాటిల్ చెప్పడం గమనార్హం.

# 'అత్తాకోడళ్ల' పోరు తప్పదా..?

ఉందని తెలిపింది. 13 ఏళ్ల కిమ్ జు యే 2022లో తొలిసారిగా ప్రపంచానికి కనిపించింది. ఆ తర్వాత ఆయుధ పరీక్షల నుంచి మిలిటరీ పరేడ్‌ల వరకు పలు అధికారిక, కీలక కార్యక్రమాల్లో తండ్రి వెంట హాజరైంది. వాస్తవానికి ఉత్తరకొరియా పురుషాధిక్య నాయకత్వ క్రమాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఆమెకు వారసత్వ బాధ్యతలు అప్పగించే అవకాశాలు తక్కువనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కానీ, గతేడాది సెప్టెంబరులో కిమ్ జోంగ్ ఉన్‌తో కలిసి బీజింగ్ పర్యటనకు వెళ్లడంతో ప్రపంచం దృష్టి ఆమెపై పడింది. కిమ్ రాజకీయ వారసురాలు ఆమెనే అనే అంచనాలు నాటినుంచే బలపడ్డాయి.

### సోదరీ.. శక్తిమంతమైన నాయకురాలే

అయితే, వారసత్వ పగ్గాల బదిలీ విషయంలో కిమ్ జోంగ్ ఉన్‌కు తన సోదరి కిమ్ యో జోంగ్ నుంచి ప్రతిఘటన ఎదురయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. 38 ఏళ్ల యో జోంగ్ ప్రస్తుతం దేశంలోనే రెండో అత్యంత శక్తిమంతమైన నాయకురాలిగా పేరొందారు. కొరియా వర్కర్స్ పార్టీ సెంట్రల్ కమిటీలో సీనియర్ హోదాలో ఆమె కొనసాగుతున్నారు. ఆమెకు దేశం లోపలా, వెలుపలా మంచి పాపులారిటీ ఉంది. సోదరుడి కిమ్ జోంగ్ ఉన్ పాలన పైనా ఆమె ప్రభావం చూపించగలరని చెబుతారు. 2022లో దక్షిణ కొరియా రక్షణమంత్రిని టార్గెట్ చేస్తూ కిమ్ యో జోంగ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. దక్షిణ కొరియా వినాశనం తప్పదంటూ ఆమె నాడు తీవ్రంగా బెదిరించారు. ఆ తర్వాత కూడా పలుమార్లు అమెరికా, జపాన్ వంటి దేశాలను హెచ్చరిస్తూ వార్తల్లో నిలిచారు. కిమ్ జోంగ్ ఉన్‌కు హఠాత్తుగా ఏమైనా జరిగితే అధికార బాధ్యతలు అందుకునేది అతని సోదరి అని గతంలో అంచనాలు వెలువడ్డాయి. రాజకీయంగానే గాక.. ఆమెకు మిలిటరీ మద్దతు కూడా ఉంది. అవకాశం వస్తే దేశ నాయకత్వ పగ్గాలను అందుకోవడానికి అన్నివిధాలా ఆమె సిద్ధంగా ఉన్నారంటూ దక్షిణ కొరియా ఇంటెలిజెన్స్ మాజీ అధికారి ఒకరు ఆ మధ్య అంచనా వేశారు.

### కిమ్ కుటుంబంలో 'రక్తచరిత్ర'..

కిమ్ కుటుంబంలో ఇలాంటి తగాదాలు కొత్తేం కాదు. రాజకీయంగా తన ఎదుగుదలకు అడ్డు అని భావించిన వారిని కిమ్ చాకచక్యంగా తప్పిస్తారనే ప్రచారం ఉంది. అధికారంలోకి వచ్చిన కొన్నేళ్ల తర్వాత 2013లో తన బంధువు, మెంటార్ అయిన జాంగ్ సోంగ్ థేక్‌కు మరణశిక్ష అమలు చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై కిమ్ ఈ చర్యలు తీసుకున్నట్లు నాడు వార్తలు వచ్చాయి. ఇక, కిమ్ సవతి సోదరుడు కిమ్ జోంగ్ నామ్ 2017లో మలేసియా ఎయిర్‌పోర్టులో హత్యకు గురయ్యారు. ఆ ఘటన వెనక కిమ్ హస్తం ఉందని ఆరోపణలు ఉన్నాయి.

# కాంగ్రెస్‌లో కొనసాగడంపై ఆలోచిస్తున్నా : జీవన్ రెడ్డి

ఏర్పడింది. ఈ క్రమంలోనే జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ వర్గీయులు క్యాంప్ రాజకీయాలు చేశారు. చివరికి సంజయ్ వర్గానికి చెందిన వ్యక్తి ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. దీంతో జీవన్‌రెడ్డి అసహనానికి గురైనట్లు సమాచారం. "ఈ ఎన్నిక ముగింపు కాదు. జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ ఉన్నంతకాలం నాకు వేధింపులు తప్పవు. పవర్ ఆఫ్ అటార్నీ ఎమ్మెల్యే సంజయ్‌కు రాసిచ్చారా? బీఆర్ఎస్ ఎమ్మెల్యేకు జగిత్యాల కాంగ్రెస్ పట్టా రాసిచ్చారు. ఎమ్మెల్యే పార్టీ మారలేదని స్పీకర్ అంటున్నారు. ఆయన మాత్రం కాంగ్రెస్ పార్టీతో సంసారం చేస్తున్నారు. కార్యకర్తల మనోభావాలను పార్టీ అధినాయకత్వం గౌరవించాలి. జగిత్యాలలోనే ఇలా ఉంటే.. పార్టీ మారిన మరో 9 ప్రాంతాల్లో ఎలా ఉందో..!" అని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# మార్చి 3న శ్రీవారి ఆలయం మూసివేత : తితిదే

సంబంధించి ఎలక్ట్రానిక్ డిప్‌లో పేర్ల నమోదు ఈ నెల 18న ఉదయం 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో ప్రారంభం కానుంది. ఈ టికెట్లకు ఈ నెల 20న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం డిప్‌లో ఎంపికచేస్తారు. డిప్‌లో ఈ-టికెట్లు పొందిన వారు ఫిబ్రవరి 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే.. టికెట్లు మంజూరవుతాయి. 21న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను విడుదల చేయనున్నారు. 23 ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. 24 ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అదే రోజు.. మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటాను విడుదల చేస్తారు.మే నెలకు సంబంధించిన శ్రీవారి సేవ, పరకామణి సేవ కోటాను ఈనెల 27న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. భక్తులు https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని తితిదే అధికారులు సూచించారు.

# అబూ సలేంకు 'సుప్రీం'లో చుక్కెదురు

ప్రాథమికంగా తేలినట్లు పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ అతడు 'సుప్రీం' తలుపు తట్టాడు. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం అతడి పిటిషన్‌ను విచారించింది. ఈ వ్యవహారంపై హైకోర్టుకే వెళ్లాలని సూచించింది. సమాజానికి హాని చేసినందుకే 25 ఏళ్ల శిక్ష పడిందని, టాడా (ఉగ్రవాద నిరోధక చట్టం) కింద దోషిగా తేలినట్లు గుర్తుచేసింది. 1993 ముంబయి పేలుళ్ల అనంతరం అబూ సలేం పోర్చుగల్‌కు పారిపోయాడు. సుదీర్ఘ న్యాయపోరాటం అనంతరం 2005 నవంబరులో కేంద్రం అతడిని భారత్‌కు రప్పించింది. అప్పగింత వ్యవహారంలో పోర్చుగల్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం.. భారత్ అతడికి మరణశిక్ష విధించకూడదు. జైలుశిక్ష కూడా 25 ఏళ్లు మించకూడదు. పోర్చుగల్‌కు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు కేంద్రం కట్టుబడి ఉందని.. 2022లో అబూ సలేం దాఖలు చేసిన వేరే పిటిషన్‌పై తీర్పు సందర్భంగా సుప్రీం కోర్టు తెలిపింది.

# ఏపీలో టెక్ పాలన గ్రేట్

సీఎం వివరించారు. వీటిని ఆసక్తిగా పరిశీలించిన బిల్ గేట్స్ పౌరసేవలను సులభతరం చేయటం బాగుందని కితాబిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పాలసీల అమలుపై ప్రజాభిప్రాయాన్ని కూడా సేకరిస్తున్న తీరును తెలుసుకున్నారు. రాష్ట్రంలో జీఎస్డీపీ పెరుగుదలను కూడా కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల ద్వారా ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నామని బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి వివరించారు. ఏపీలోని ప్రాపర్టీ రికార్డుల భద్రతకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని ముఖ్యమంత్రిని గేట్స్ అడిగారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి బ్లాక్ చైన్ టెక్నాలజీతో ల్యాండ్ రికార్డులను భద్రపరుస్తున్నామని వివరించారు. భూ రికార్డులపై క్యూఆర్ కోడ్ లాంటి భద్రతా ఫీచర్లను ఏర్పాటు చేసి పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ప్రభుత్వ డాక్యుమెంట్లను ప్రజలకు అందుబాటులో ఉంచేలా ఏపీ ఏఐ సెర్చ్ బార్ ను అందుబాటులోకి తెచ్చామని అధికారులు గేట్స్‌కు ప్రజంటేషన్ ఇచ్చారు. దీనిని పరిశీలించిన బిల్ గేట్స్ పన్నుల వసూళ్ల ప్రక్రియ అద్భుతంగా ఉందని వ్యాఖ్యానించారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత దేశంలో పన్నుల వసూళ్ల ప్రక్రియ బాగా సులభతరమైందని, వసూళ్లు కూడా పెరిగాయని ముఖ్యమంత్రి వివరించారు.

### సంజీవని ప్రాజెక్టు వెరీ నైస్ : గేట్స్

గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పం, చిత్తూరు జిల్లాలో నడుస్తున్న సంజీవని ప్రాజెక్టు అమలును గేట్స్ అత్యంత ఆసక్తిగా పరిశీలించారు. బ్లడ్ ప్రెషర్, డయాబెటీస్ లాంటి వైద్య పరీక్షల అనంతరం ఏం చర్యలు చేపడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. ఎవరైనా ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటే వారికి ఎలాంటి సేవలు అందుతున్నాయని గేట్స్ ఆరా తీశారు. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డుల ప్రాజెక్టు చక్కగా ఉందని కితాబు ఇస్తూ... దట్స్ వెరీ నైస్ అంటూ గేట్స్ వ్యాఖ్యానించారు. ప్రజల డిజిటల్ హెల్త్ రికార్డులను అనుసరించి వారి లైఫ్ స్టైల్ మార్పు, ఆహారం తీసుకునే అంశాల్లో సలహాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి వివరించారు. ఏఐ వినియోగం ద్వారా ప్రాథమికంగా వారి సందేహాలను తీర్చేలా వైద్య సేవలను అందించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. దీనిపై స్పందించిన బిల్ గేట్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగించి వైద్య సేవలు అందించే విధానం చాలా బాగుందని ప్రశంసించారు. భారత్ బయోడిజైన్ ద్వారా భవిష్యత్తులో వైద్య సేవలు అందించే విధానాన్ని గేట్స్ అడిగి తెలుసుకున్నారు. అల్ట్రా సౌండ్ పరీక్షలు, స్కానింగ్ పరీక్షల కోసం గర్భిణులు ఎక్కువ వ్యయం చేయాల్సి వస్తోందని.. డయాగ్నోస్టిక్స్ సేవలు తక్కువ వ్యయానికే అందితే వారికి వెసులుబాటు ఉంటుందని గేట్స్ వ్యాఖ్యానించారు. అనంతరం ప్రజా రాజధాని అమరావతి నిర్మాణాలపై ఇచ్చిన ప్రజంటేషన్‌ను కూడా బిల్ గేట్స్ ఆసక్తిగా పరిశీలించారు. రాజధాని నిర్మాణంలో 30 శాతం మేర నీటి వనరులు, పచ్చదనం కోసం కేటాయించిన ప్రణాళిక బాగుందని అన్నారు. రాజధాని నిర్మాణం జరుగుతున్న తీరును గేట్స్‌కు సీఎం చంద్రబాబు వివరించారు. దీనిపై స్పందించిన బిల్ గేట్స్ గ్రేట్ వర్క్ అంటూ వ్యాఖ్యానించారు.

### గేట్స్‌కు యువ అధికారుల ప్రజెంటేషన్

అంతకుముందు ఆర్టీజీఎస్ కేంద్రంలోకి వచ్చిన బిల్ గేట్స్‌కు వీడియో డిస్ ప్లే వాల్‌పై యువ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రజంటేషన్లు ఇచ్చారు. ఆర్టీజీఎస్ ప్రత్యేక అధికారులు ధాత్రిరెడ్డి, మలికా గార్గ్, ప్రఖర్ జైన్, సౌరబ్ గౌర్, సురేశ్ కుమార్‌లు ప్రజంటేషన్ల ద్వారా డేటా లేక్, అవేర్ 2.0, వాట్సప్ గవర్నెన్సు, పీపుల్స్ పర్సెప్షన్, ఏజెంట్ స్పేస్ ఏఐ సెర్చ్ బార్, సంజీవని, అమరావతి ప్రాజెక్టుల గురించి వివరించారు. ఆర్టీజీఎస్ కేంద్రంలో జరిగిన ప్రజంటేషన్ల కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, సీఎస్ కె.విజయానంద్ సహా తదితర అధికారులు పాల్గొన్నారు.

### గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఏపీకి కొత్త దశ-దిశ
### కుప్పంలో సంజీవని ప్రాజెక్టు అమలుపై బిల్ గేట్స్ ప్రశంసలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంతో రాష్ట్ర అభివృద్ధికి కొత్త దశ-దిశ ఏర్పడుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గేట్స్ ఫౌండేషన్ ఛైర్మన్ బిల్ గేట్స్ అమరావతి రాక చారిత్రాత్మకంగా నిలుస్తుందని, ఆంధ్రప్రదేశ్ ప్రజల సాధికారతకు ఇది దోహదపడుతుందని ముఖ్యమంత్రి అన్నారు. సోమవారం బిల్ గేట్స్ అమరావతి పర్యటనలో భాగంగా సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి... ముందుగా గేట్స్, ఆయన బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బిల్ గేట్స్‌తో తన అనుబంధాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. 1997లో మొదటిసారి తాను బిల్ గేట్స్‌ను కలిశానని... హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించానని... మైక్రోసాఫ్ట్ రాకతో ఇప్పుడు హైదరాబాద్ ఐటీ రంగంలో మేటిగా నిలబడిందన్నారు. రాష్ట్ర విభజన అనంతరం తాను ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం పనిచేస్తున్నానని ముఖ్యమంత్రి చెప్పారు. ఏపీలో వనరులకు లోటు లేదని, సంపద సృష్టి జరగాల్సి ఉందన్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో 2047 నాటికి రాష్ట్రాన్నినెంబర్‌వన్ చేస్తామనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

### చంద్రబాబు విజనరీ అని ఆనాడే తెలిసింది

సమావేశంలో మాట్లాడిన బిల్ గేట్స్...డిజిటల్ విప్లవానికి భారత్‌లో బలమైన పునాదులు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. భారతదేశ డిజిటల్ విప్లవంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషిస్తున్నారని కితాబిచ్చారు. తాను మొదటిసారి చంద్రబాబును కలిసినప్పుడు ఆయన ఆలోచనల్లో ముందుచూపు ఉందనే విషయాన్ని ఆనాడే గ్రహించినట్టు వెల్లడించారు. ఈ విషయంలో నాటి సింగపూర్ ప్రధాని మాత్రమే చంద్రబాబుకు కొంత దగ్గరగా ఉన్నారని చెప్పారు. గేట్స్ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాల్లో ఆరోగ్య రంగానికి చెందిన ప్రాజెక్టులే మెజార్టీ ప్రాజెక్టులని తెలిపారు. ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్నది తన ఆశయమన్నారు. కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని కార్యక్రమం అద్భుతంగా ఉందని అభినందించారు. విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకోవడానికి, వారికి సరైన రీతిలో... తగిన స్థాయిలో విద్యా బోధన చేయడానికి ఏఐ సహాయపడుతుందన్నారు. విద్యారంగంలో మార్పు తీసుకురావడానికి ఏఐ-టెక్నాలజీ ఉపయోగపడుతుందని చెప్పిన బిల్ గేట్స్, వ్యవసాయం రంగం చాలా ముఖ్యమైనదిగా అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ సాయంతో ఏపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడం...టెక్నాలజీని రైతులకు అందించేందుకు... ఏఐను వ్యవసాయంతో ఇంటిగ్రేట్ చేస్తూ కృషి చేయడాన్ని అభినందించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా వ్యవసాయంలో ఏఐని ఇంతలా వినియోగించడం లేదని... కానీ ఆంధ్రప్రదేశ్ ఈ విషయంలో ముందుండటం మంచి పరిణామమని చెప్పారు. విపత్తుల నిర్వహణ కోసం టెక్నాలజీతో ముందస్తు అంచనాలు వేసి... ప్రాణ నష్టం జరగ్గకుండా జాగ్రత్తలు తీసుకునే వ్యవస్థ ఏర్పాటు చేయడం బాగుందన్నారు. చంద్రబాబు తనకు గుడ్ ఓల్డ్ ఫ్రెండ్ అని సమావేశంలో బిల్ గేట్స్ సరదాగా వ్యాఖ్యానించారు.

### పది సూత్రాలతో స్వర్ణాంధ్ర-2047 సాకారం

స్వర్ణాంధ్ర 2047 విజన్, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పాలసీలు, లక్ష్యాలు, కార్యక్రమాలపై బిల్ గేట్స్‌కు ముఖ్యమంత్రి ప్రజెంటేషన్ ఇచ్చారు. జీరో పావర్టీ, సంపూర్ణ ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, నీటి భద్రత, రైతు-అగ్రి టెక్, ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్, ఎనర్జీ-ఫ్యూయల్, ప్రోడక్ట్ పర్ఫెక్షన్, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్... ఈ 10 సూత్రాలతో స్వర్ణాంధ్ర సాధనకు కృషి చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అనేది ఏపీ ప్రభుత్వ విధానమని... దీనికి ఆధార్ ధృవీకరణ, వ్యక్తిగత, కుటుంబ డేటా లేక్, కుటుంబ సమాచారం, రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వ సమగ్ర డేటా, అవేర్ ద్వారా రియల్ టైమ్ డేటా సేకరణ, వాట్సాప్ గవర్నెన్స్, డిజి వెరిఫై వంటి అప్లికేషన్ల వినియోగం ద్వారా భవిష్యత్ కోసం పూర్తి సన్నద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి అన్నారు. టెక్నాలజీ ఆధారిత థీమాటిక్ క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. అలాగే క్వాంటం వ్యాలీ-డిజైన్ - ఫౌండ్రీగా అమరావతి, డేటా-ఏఐ సిటీగా విశాఖ, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా కాకినాడ, డ్రోన్ సిటీగా ఓర్వకల్లు, ఎలక్ట్రానిక్స్-ఏరో సిటీగా లేపాక్షి, ఎలక్ట్రానిక్స్-స్పేస్ సిటీగా తిరుపతిని అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. రాష్ట్రంలో మొత్తం 10 రంగాలు, 30 ప్రభుత్వ విభాగాల్లో ఏఐని వినియోగిస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. 98 ఏఐ యూజ్ కేసులు, 43 హ్యాకథాన్లు ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నాయన్నారు. మొత్తం 7 డేటా లెక్ ప్రాజెక్టులు ప్రారంభించినట్టు తెలిపారు.

### 2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్డీపీగా రాష్ట్రం

స్వర్ణాంధ్ర-2047 నాటికి ముఖ్య లక్ష్యాలు నిర్దేశించుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. 'ప్రస్తుతం 180 బిలియన్ డాలర్లుగా ఉన్న రాష్ట్ర ఎకానమీని 2.4 ట్రిలియన్ డాలర్ల జీఎస్డీపీగా తీర్చిదిద్దడం, తలసరి ఆదాయం ప్రస్తుతం 3,400 డాలర్లు ఉండగా 2047 నాటికి దీనిని 42,000 డాలర్లకు పెంచడం, ఎగుమతులు 20.7 బిలియన్ డాలర్ల నుంచి 450 బిలియన్ డాలర్లకు పెంచడం, నిరుద్యోగితను 4.1 శాతం నుంచి 2 శాతం కన్నా తగ్గించడం, మహిళా కార్మికుల సంఖ్యను 45.8 శాతం 80 శాతానికి పెంచడం, ప్రస్తుతం 72 శాతంగా ఉన్న అక్షరాస్యతను 100 శాతానికి తీసుకువెళ్లడం, 95 శాతం నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఉండేలా చూడటం, సగటు ఆయుర్దాయం 85 ఏళ్లు, ఎంఎంఆర్ ప్రతీ లక్ష జననాలకు 5, ఐఎంఆర్ ప్రతీ వెయ్యి జననాలకు 2 కన్నా తగ్గించగలగడం, గర్భిణులలో రక్తహీనత సమస్య, వైద్యంపై వ్యక్తిగత ఖర్చు 5 శాతానికి తగ్గించడమే లక్ష్యం'గా సీఎం చెప్పారు.

### బిల్‌గేట్స్‌తో మంత్రుల ఇంటరాక్షన్

సమావేశంలో పలు అంశాలపై ప్రశ్నలు వేసి మంత్రులు పయ్యావుల, సత్యకుమార్ యాదవ్ గేట్స్ అభిప్రాయాలు తెలుసుకున్నారు. హైదరాబాద్‌లో మైక్రో సాఫ్ట్ సెంటర్ ఏర్పాటు చేయాలనే ఆలోచనకు కారణమేంటని మంత్రి పయ్యావుల అడగ్గా..... దీనికి బిల్ గేట్స్ ఆసక్తికర సమాధానం చెప్పారు. నాడు చంద్రబాబు ఐటీని ప్రమోట్ చేయడం వల్ల టెక్ నిపుణులు చాలా మంది హైదరాబాద్ నుంచే వచ్చేవారని అన్నారు. అదే సమయంలో చంద్రబాబు మైక్రో సాఫ్ట్ కార్యాలయాన్ని హైదరాబాద్ లో పెట్టాలనే ప్రతిపాదన పెట్టారని బిల్ గేట్స్ తెలిపారు. దీనిపై తమ వద్ద పని చేసే వారి అభిప్రాయం కోరితే... హైదరాబాద్ సెంటర్ ఏర్పాటు చేస్తే తాము వెళ్లడానికి సిద్దంగా ఉన్నట్టు చెప్పారని బిల్ గేట్స్ సమావేశంలో వివరించారు. ఇప్పుడు కూడా భారతదేశంలో మైక్రో సాఫ్ట్ కంపెనీల్లో పని చేసే చాలా మంది ఉద్యోగుల్లో హైదరాబాద్ వారే ఎక్కువగా ఉన్నారని బిల్ గేట్స్ అన్నారు. ఇక ఏఐ ద్వారా ఆరోగ్య సేవలు ఏ విధంగా అందించవచ్చని బిల్ గేట్స్‌ను మంత్రి సత్యకుమార్ అడిగారు. ఏఐ టెక్నాలజీతో ఆరోగ్య రంగంలో మెరుగైన సేవలు అందించవచ్చని... నాణ్యమైన, నిపుణుల వైద్య సేవలను మారుమూల ప్రాంతాలకు కూడా అందించే అవకాశం ఉంటుందని గేట్స్ వెల్లడించారు. సీనియర్ ఐఏఎస్ అధికారి బాబు ఏ అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా... ఎఐ రాకతో ఉద్యోగాలను పునర్నిర్వచించాల్సిన అవసరం ఉందని బిల్ గేట్స్ అభిప్రాయపడ్డారు. అలాగే ఈ వారం ఢిల్లీలో జరుగుతున్న ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో కూడా ఎఐ వల్ల వచ్చే అవకాశాలు, ఎదురయ్యే సవాళ్ల గురించి ప్రపంచంలోని ఎఐ నిపుణులంతా చర్చిస్తారని గేట్స్ వివరించారు.

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com

# ఎడిటర్ వాయిస్

## నారా భువనేశ్వరి అన్ స్టాపబుల్.. ఎన్టీఆర్ ట్రస్టు @ 30

ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, హెరిటేజ్ ఫుడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ నారా భువనేశ్వరి అరుదైన మైలురాయిని స్థాపించారు. ఆమె నేతృత్వంలోని ఎన్టీఆర్ ట్రస్టు మూడు దశాబ్దాల ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. లక్షలాది మందికి సేవలు అందించిన సంస్థగా ఎన్టీఆర్ ట్రస్టు నిలిచిందని ఈ సందర్భంగా పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ కూడా భువనేశ్వరి సారథ్యంలో ఎన్టీఆర్ ట్రస్టు సేవలను కొనియాడుతూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. 1997లో టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ స్ఫూర్తితో హైదరాబాద్ లోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టును ప్రారంభించారు. అప్పటి నుంచి ట్రస్టీగా కొనసాగుతున్న భువనేశ్వరి రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి తనదైన ముద్ర వేశారు.

1997లో ఎన్టీఆర్ ట్రస్టు స్థాపించిన నుంచి భువనేశ్వరి ట్రస్టీగా కొనసాగుతున్నారు. ఈ సంస్థ ద్వారా అందిస్తున్న సేవలకు గాను ఆమె గత ఏడాది లండన్‌లో ప్రతిష్టాత్మక 'డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025' అవార్డును సైతం అందుకున్నారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ప్రధానంగా బ్లడ్ బ్యాంకులు, పాఠశాల నిర్వహణతో భువనేశ్వరి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. భర్త చంద్రబాబు రాజకీయాల్లో బిజీగా ఉండటంతో ఆమె పూర్తిస్థాయిలో ట్రస్టు బాధ్యతలను తలెకెత్తుకుని 30 ఏళ్లుగా విజయవంతంగా నడుపుతున్నారని అభినందనలు అందుకుంటున్నారు. ఒకవైపు వ్యాపార వేత్తగా హెరిటేజ్ ఫుడ్స్ ను లాభాల బాటలో నడిపిస్తున్న భువనేశ్వరి ట్రస్టీగా కూడా సంస్థ అభివృద్ధికి సమయం కేటాయించడం విశేషంగా చెబుతున్నారు.

30 ఏళ్ల క్రితం హైదరాబాద్ నుంచి ట్రస్టు సేవలు ప్రారంభించిన భువనేశ్వరి దశలవారీగా రెండు తెలుగు రాష్ట్రాల్లో కార్యాలయాలను విస్తరించినట్లు చెబుతున్నారు. తిరుపతి, విశాఖపట్నం, రాజమహేంద్రవరంల్లో బ్లడ్ బ్యాంకులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా విజయవాడలో మరో కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు. గండిపేట, కృష్ణా జిల్లా చల్లపల్లిలో విద్యాసంస్థల ద్వారా వందల మంది కార్యకర్తలు, అనాథ పిల్లలకు ఉచిత చదువులు చెప్పిస్తున్నారు భువనేశ్వరి. కాగా, ట్రస్టును 30 ఏళ్లుగా విజయవంతంగా ఒక కార్పొరేట్ సంస్థ తరహాలో నడపడమే అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోందని వ్యాఖ్యానిస్తున్నారు.

ఒకవైపు వేల కోట్ల టర్నోవర్ ఉన్న హెరిటేజ్ ఫుడ్స్ లాంటి వ్యాపార సామ్రాజ్యాన్ని, మరోవైపు లక్షలాది మందికి సేవలందించే ఎన్టీఆర్ ట్రస్టును ఆమె సమన్వయం చేసే విధానం చర్చనీయాంశంగా మారింది. భువనేశ్వరి పనితీరు ఇతర మహిళా పారిశ్రామికవేత్తలకు ఆదర్శనీయంగా చెబుతున్నారు. భర్త, కుమారుడు రాజకీయంగా కీలక పదువుల్లో ఉన్నప్పటికీ ట్రస్టు వ్యవహారాల్లో వారిని జోక్యం చేసుకోనీయకుండా భువనేశ్వరి ఒంటిచేత్తో కార్యాకలాపాలు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు.

ట్రస్టుకు వచ్చే ప్రతి పైసాకు లెక్క ఉండేలా డిజిటల్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. వ్యాపారవేత్తగా ఆమెకున్న అనుభవం ట్రస్టును ఆర్థికంగా స్థిరంగా నడపడానికి ఉపయోగపడుతుందని చెబుతున్నారు. కేవలం కార్యాలయంలో కూర్చోకుండా, ఆమె స్వయంగా తలసీమియా కేంద్రాలను, ఎన్టీఆర్ మోడల్ స్కూళ్లను సందర్శించి విద్యార్థులతో, రోగులతో నేరుగా మాట్లాడుతుంటారు. దీనివల్ల ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ దేశంలోనే అత్యుత్తమమైనదిగా గుర్తింపు సాధించినట్లు చెబుతారు. ఇలా 30 ఏళ్లుగా ఎన్టీఆర్ ట్రస్టు సేవలు అందిస్తున్న భువనేశ్వరి ప్రయాణం అన్ స్టాపబుల్ గా సాగిపోతోందని వ్యాఖ్యానిస్తున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




ఒకరు బీఏ, మరొకరు ఇంటర్..

## 5 ఏళ్లు వైద్యులుగా చలామణి



**లఖ్‌నవూ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని అంబేడ్కర్ నగర్ జిల్లా బస్ఖారీ పట్టణంలో గత అయిదేళ్లుగా కొనసాగుతున్న నకిలీ వైద్యుల ఆసుపత్రి గుట్టు రట్టయింది. ఈ క్లినిక్‌ను నడుపుతున్న యోగేశ్‌వర్మ (32) బీఏ పట్టభద్రుడు కాగా, అతడి సహాయ వైద్యుడిగా పనిచేస్తున్న శుభం విశ్వకర్మ (22) ఇంటర్ వరకు చదువుకున్నాడు. యోగేశ్ తండ్రి జలాల్‌పూర్ ఆసుపత్రిలో వార్డు బాయ్ కావడంతో తండ్రికి సహాయంగా వెళ్లి వైద్యపరమైన కొన్ని మెళకువలు నేర్చుకున్నాడు. దీంతో ఏకంగా ఆసుపత్రినే ప్రారంభించి శస్త్రచికిత్సలు సైతం చేస్తూ వచ్చాడు. శుభం ఇతడికి జత కలిశాడు. ప్రసవం కోసం ప్రియాంక అనే యువతి ఈనెల 5న వీరి ఆసుపత్రిలో చేరింది. ఆమెకు సిజేరియన్ శస్త్రచికిత్స చేయగా, తీవ్ర రక్తస్రావమై ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటపడింది. యోగేశ్, శుభంలను శుక్రవారం అరెస్టు చేసిన పోలీసులు క్లినిక్‌ను సీజ్ చేశారు.

## వెయ్యి కిలోల గంజాయి పట్టివేత

**పాడేరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒడిశా నుంచి రవాణా చేస్తున్న వెయ్యి కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అరెస్టు చేశామని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డీఎస్పీ అభిషేక్ తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి జి.మాడుగుల మండలం మత్స్యపురం కూడలి వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఒడిశా నుంచి వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా 17 బస్తాల్లో వెయ్యి కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఐదుగురిని అరెస్టు చేశామని, డ్రైవర్ పరారీలో ఉన్నారని డీఎస్పీ వెల్లడించారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని.. వాహనాన్ని సీజ్ చేశామని చెప్పారు.

## రాజస్థాన్‌లో అగ్ని ప్రమాదం..

### ఏడుగురి సజీవ దహనం



**విశ్వం వాయిస్ న్యూస్ :** రాజస్థాన్‌లో భివాడీలోని ఓ రసాయన ఫ్యాక్టరీ లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఏడుగురు సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున భివాడీలోని ఓ రసాయన ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. అనంతరం భారీ పేలుళ్లు సంభవించడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ముందుజాగ్రత్త చర్యగా, సమీపంలోని కర్మాగారాల్లో పని చేస్తున్నవారిని ఖాళీ చేయించామన్నారు. ఈ ప్రమాదంలో సజీవదహనమైన ఏడుగురి మృతదేహాలను బయటకు తీసినట్లు అధికారులు పేర్కొన్నారు. మరికొందరు కార్మికులు మంటల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత రావాల్సిఉంది. ప్రమాదంలో రూ.లక్షలు విలువ చేసే వస్తువులు, యంత్రాలు బూడిదయ్యాయన్నారు. ఫ్యాక్టరీలో నిల్వ చేసిన గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు అనుమానం వ్యక్తంచేశారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. అగ్ని ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై ప్రధాని నరేంద్ర మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ ప్రమాదంపై ముఖ్యమంత్రి భజన్ లాల్ శర్మ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ ఘటనలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

## రైతు ప్రాణం తీసిన విద్యుత్తు తీగ



**ఊట్కూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతిచెందిన ఘటన నారాయణపేట జిల్లాలో చోటుచేసుకుంది. ఎస్సై రమేశ్ కథనం ప్రకారం.. ఊట్కూరు మండలం పగిడిమర్రి గ్రామానికి చెందిన రైతు మగ్దూమ్ అలీ(54) తిప్రాస్‌పల్లి శివారులో ఉన్న పొలంలో వేరుసెనగ సాగు చేశారు. అడవి పందుల నుంచి పంటను రక్షించుకునేందుకు పొలం చుట్టూ విద్యుత్తు తీగలతో కంచె ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆయన శనివారం సాయంత్రం పొలానికి వెళ్లి రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. భార్య షాహిదాబేగం ఫోన్ చేసినా స్పందించలేదు. వెంటనే ఆమె కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. వారు వెళ్లి చూడగా ఆయన కంచె వద్ద విద్యుదాఘాతానికి గురై పడి ఉన్నారు. వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆదివారం మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## బేగంపేటలో భారీ చోరీ..

### 30 తులాల బంగారం అపహరణ

**బేగంపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీ చోరీ జరిగింది. ఓ వృద్ధురాలు శివరాత్రికి తన కూతురి ఇంటికి వెళ్లి వచ్చేలోపు ఇల్లు గుల్లయింది. ఈ ఘటన బేగంపేట సమీపంలోని శ్యామ్‌లాల్ వద్ద చోటు చేసుకుంది. చోరీకి పాల్పడిన దుండగులు 30 తులాల బంగారం, 2 కిలోల వెండి, రూ.50వేల నగదు అపహరించినట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. బేగంపేట శ్యామ్‌లాల్ వద్ద ఓ వృద్ధురాలు మూడో అంతస్తులో నివసిస్తున్నారు. ఆదివారం శివరాత్రి కావడంతో.. తన కుమార్తె ఇంటికి వెళ్లారు. ఉదయాన్నే తిరిగి వచ్చేసరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటంతోపాటు బీరువాలో ఉన్న బంగారం, వెండి కనిపించలేదు. దీంతో వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు అక్కడి పరిస్థితిని పరిశీలించారు. గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో

## ఐదుగురి దుర్మరణం

### అందరూ విద్యార్థులే.. బెంగళూరులో దుర్ఘటన

**బెంగళూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్ణాటకలో వరుస రహదారి ప్రమాదాలు హడలెత్తిస్తున్నాయి. శనివారం అర్ధరాత్రి బెంగళూరులోని మాదనాయకనహళ్లి పోలీసుఠాణా పరిధిలోని జిందాల్ కూడలి వద్ద సంభవించిన ఘోర ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులు అసువులు బాశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దొడ్డబళ్లాపురకు చెందిన హర్షిత్(20) రాత్రి 8.30 గంటలకు స్నేహితుల దగ్గరకు వెళుతున్నట్లు తల్లిదండ్రులకు చెప్పి కారులో బయటకు వెళ్లాడు. అనంతరం నలుగురు స్నేహితులను ఎక్కించుకున్నాడు. తర్వాత అంతా బెంగళూరు వైపు వెళ్లారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో తుమకూరు వైపు నుంచి అతివేగంగా వస్తున్న కారు జిందాల్ కూడలి వద్ద డివైడర్‌పైకి దూసుకెళ్లి బెంగళూరు నుంచి వస్తున్న కేఎస్ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులూ మృత్యువాత పడ్డారు. ఈ నెల 13న హొసకోట - దాబస్‌పేట రహదారిలోని ఎం.సత్యవర వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులు మృతి చెందిన సంగతి తెలిసిందే.

## ఉసిరికాయ జ్యూస్ లేదా పసుపు నీరు.. మెరిసే చర్మానికి ఏది మంచిది..?

మనిషి ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే రెండు అద్భుతమైన పదార్థాలు ఉసిరికాయ (గూస్బెర్రీ), పసుపు. ఇవి రెండూ ఆయుర్వేదంలో ఎంతో ప్రాముఖ్యత పొందినవి. చర్మ కాంతిని పెంచడంలో, శరీరాన్ని లోపల నుంచి శుభ్రపరచడంలో ఇవి విశేష పాత్ర పోషిస్తాయి. అయితే, వీటిని ఎలా, ఎప్పుడు తీసుకోవాలి అన్నదానిపై చాలామందికి సందేహాలు ఉంటాయి. మన అందాన్ని కాపాడుకోవడం కోసం మనం అనేక మార్గాలను అనుసరిస్తుంటాం. ఆధునిక జీవనశైలిలో కూడా పాతకాలపు గృహ నివారణలకు ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా వంటగదిలో లభించే సహజ పదార్థాలు ఆరోగ్యం, అందానికి ఎంతో మేలు చేస్తాయి. అలాంటి రెండు అద్భుతమైన పదార్థాలు ఉసిరికాయ (గూస్బెర్రీ), పసుపు. ఇవి రెండూ ఆయుర్వేదంలో ఎంతో ప్రాముఖ్యత పొందినవి. చర్మ కాంతిని పెంచడంలో, శరీరాన్ని లోపల నుంచి శుభ్రపరచడంలో ఇవి విశేష పాత్ర పోషిస్తాయి. అయితే, వీటిని ఎలా?, ఎప్పుడు తీసుకోవాలి అన్నదానిపై చాలామందికి సందేహాలు ఉంటాయి.




**ఉసిరికాయ రసం ప్రయోజనాలు**

ఉసిరికాయ విటమిన్ జ సమృద్ధిగా కలిగిన అద్భుతమైన ఫలం. ఇది శరీరంలో కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచి చర్మ స్థితిస్థాపకతను కాపాడుతుంది.

**ఉసిరికాయ రసం తీసుకోవడం వల్ల..**

అకాల వృద్ధాప్యాన్ని తగ్గిస్తుంది. ముడతలు, సన్నని గీతలను తగ్గిస్తుంది. సూర్యరశ్మి వల్ల కలిగే నష్టాన్ని తగ్గిస్తుంది. చర్మానికి సహజ కాంతిని అందిస్తుంది. నిస్తేజంగా కనిపించే చర్మాన్ని ఉజ్వలంగా మారుస్తుంది. చిన్న వయసులోనే వృద్ధాప్య లక్షణాలు కనిపిస్తున్నవారికి ఉసిరికాయ ఎంతో మేలు చేస్తుంది. ఇది శరీర రోగనిరోధక శక్తిని కూడా పెంచుతుంది.

**పసుపు నీటి ప్రయోజనాలు**

పసుపులో ఉండే కర్కుమిన్ శక్తివంతమైన యాంటీ-ఇన్ఫ్లమేటరీ, యాంటీబ్యాక్టీరియల్ గుణాలను కలిగి ఉంటుంది.

**పసుపు నీరు తాగడం వల్ల..**

చర్మ ఇన్ఫెక్షన్లను తగ్గిస్తుంది. మొటిమలను నియంత్రిస్తుంది. నల్లటి మచ్చలను తగ్గిస్తుంది. రక్తాన్ని శుద్ధి చేస్తుంది. చర్మ రంగును సమంగా మార్చడంలో సహాయపడుతుంది. జిడ్డుగల చర్మం, దీర్ఘకాలిక మొటిమలు, మచ్చల సమస్యలతో బాధపడేవారికి పసుపు ఎంతో ఉపయుక్తం.

**ఉదయం పూట ఏది మంచిది?**

నిద్ర లేవగానే ముందుగా ఒక గ్లాసు సాధారణ నీరు తాగడం మంచిది. ఇది శరీరాన్ని హైడ్రేట్ చేస్తుంది, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. జీవక్రియను వేగవంతం చేస్తుంది. అదనంగా, ఉదయం గోరువెచ్చని సహజ పానీయాలు తీసుకోవడం మరింత ప్రయోజనకరం. ఉసిరికాయ రసం, పసుపు నీరు రెండూ ఉదయాన్నే తీసుకుంటే శరీరానికి పూర్తి ప్రయోజనం అందుతుంది.

**సేవించేందుకు ఉత్తమ విధానం**

ఒక గ్లాసు తాజా ఉసిరికాయ రసంలో.. చిటికెడు పసుపు పొడి, కొద్దిగా అల్లం రసం కలిపి గోరువెచ్చగా తాగాలి. ఈ మిశ్రమం వల్ల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీరాన్ని లోపల నుంచి శుభ్రపరుస్తుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. చర్మానికి రెట్టింపు కాంతిని అందిస్తుంది. సహజ పదార్థాలతో ఆరోగ్యాన్ని, అందాన్ని కాపాడుకోవడం అత్యుత్తమ మార్గం. క్రమం తప్పకుండా వీటిని తీసుకుంటే లోపల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, బయట కనిపించే అందం కూడా సహజంగా మెరుగవుతుంది.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

మంగళవారం, 17 ఫిబ్రవరి 2026




www.viswamvoice.com

### శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో

# స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన ఎంపీ పురందేశ్వరి

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి విద్యార్థులకు సూచించారు. సోమవారం రాజమండ్రి మోరంపూడి శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో శ్రీ చైతన్య విద్యా సంస్థల అధినేత కీ.శే. డాక్టర్ బి.ఎస్. రావు స్మారకార్థం నిర్వహించిన డా. బి. ఎస్. రావు మెమోరియల్ జోనల్ స్పోర్ట్స్ మీట్ 2025-2026 కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి,చైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ యలమంచిలి శ్రీధర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా సమాన ప్రాధాన్యం కలిగి ఉండాలని, క్రీడలు శారీరక ధృఢత్వం, మానసిక స్థైర్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. చైతన్య విద్యా సంస్థలు క్రీడా రంగంలో విశిష్ట స్థానాన్ని సంపాదించాయని అభినందించారు. డైరెక్టర్ యలమంచిలి శ్రీధర్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు మొబైల్ ఫోన్లలో ఎక్కువ సమయం గడుపుతున్నారని, వారిని మైదానంలోకి తీసుకువచ్చి మంచి క్రీడాకారులుగా తీర్చిదిద్దడం సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి జోన్ల స్కూల్స్ ఎగ్జిక్యూటివ్ ఏజీయమ్ ఎం.వి. సురేష్ విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగి దేశానికి గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు. జోనల్ స్పోర్ట్స్ మీట్ ముగింపు వేడుకకు ముఖ్య అతిథిగా రాజమండ్రి అడిషనల్ ఎస్పీ చెంచురెడ్డి హాజరయి విజేతలను అభినందించి బహుమతులు అందజేశారు. క్రీడలు క్రమశిక్షణ, సమయపాలన మరియు జట్టు భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి జోన్ల స్కూల్స్ ఎగ్జిక్యూటివ్ ఏజీయమ్ ఎం.వి. సురేష్ రాజమండ్రి మరియు కాకినాడ కాలేజీల ఎగ్జిక్యూటివ్ ఏజీయమ్ ఎం. హరిప్రసాద్, రాజమండ్రి స్కూల్స్ ప్రాంతీయ అధికారి వి. ఉదయ శంకర్, పిఠాపురం ప్రాంతీయ అధికారి పి. శ్రీనివాస్, మండపేట ప్రాంతీయ అధికారి ఎం.వి.ఎల్. నరేష్, ఆల్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆర్.పి. రాజశేఖర్, ప్రిన్సిపల్స్, కోఆర్డినేటర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఘనంగా విజయవంతం చేశారు.

# మాజీ ఎంపీ తడపట్ల రత్నాబాయి కన్నుమూత..

## మన్యంలో పెను విషాదం





**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక శకం ముగిసింది. గిరిజన హృదయస్పందనగా, కాంగ్రెస్ పార్టీ నమ్మిన బంటుగా దశాబ్దాల పాటు సేవలు అందించిన మాజీ రాజ్యసభ సభ్యురాలు తడపట్ల రత్నాబాయి (79) ఆదివారం రాత్రి కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె, ఆదివారం రాత్రి ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆమె పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ ఆమె తుదిశ్వాస విడిచారు. ఈ వార్త తెలియగానే రంపచోడవరం మన్యంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. రత్నాబాయి రాజకీయ ప్రస్థానం ఒక అద్భుతం. కేవలం 25 ఏళ్ల వయసులోనే, అంటే 1972లో ఆమె కాంగ్రెస్ పార్టీ తరఫున ఎల్లవరం (ప్రస్తుత రంపచోడవరం) నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆ కాలంలో అత్యంత చిన్న వయసులో చట్టసభకు ఎన్నికైన మహిళా నేతల్లో ఒకరిగా ఆమె రికార్డు సృష్టించారు. అప్పటి నుంచి ఆమె వెనుదిరిగి చూడలేదు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం, వారి హక్కుల కోసం నిరంతరం గళం వినిపిస్తూ పార్టీలో సీనియర్ నాయకురాలిగా ఎదిగారు. ఆమె నిబద్ధతను గుర్తించిన కాంగ్రెస్ అధిష్ఠానం ఆమెకు జాతీయ రాజకీయాల్లోనూ అవకాశం కల్పించింది. 2008 నుంచి 2014 వరకు ఆమె రాజ్యసభ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వహించి, గిరిజన సమస్యలను పార్లమెంటు దృష్టికి తీసుకెళ్లారు. అంతకుముందు 2007లో గిరిజన సహకార సంస్థ చైర్మన్‌గా కూడా ఆమె పనిచేశారు. రాజ్యసభ పదవీకాలం ముగిసిన తర్వాత, 2014లో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నియమితులై 2020 వరకు శాసనమండలిలో చురుకైన పాత్ర పోషించారు. ఇలా ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీగా మూడు వేర్వేరు సభల్లో ప్రాతినిధ్యం వహించిన అరుదైన నేతగా ఆమె నిలిచారు. రత్నాబాయి కుటుంబం మొత్తం రాజకీయాలతో ముడిపడి ఉంది. ఆమె భర్త కూడా పీసీసీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొంతకాలంగా వయసు రీత్యా, అనారోగ్యం కారణంగా ఆమె ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ రంపచోడవరంలోని తన నివాసంలోనే ఉంటున్నారు. ఆమె మరణవార్త విన్న వెంటనే కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల, ఇతర రాజకీయ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. నిస్వార్థ రాజకీయాలకు ఆమె నిలువుటద్దమని, గిరిజనులకు ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

### పవన్ ఫ్యూచర్ ప్లాన్

# జాతీయపార్టీగా జనసేన!



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన పార్టీని జాతీయస్థాయికి విస్తరించాలని వ్యూహం రచిస్తున్నారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సందర్భంగా పవన్ చేసిన వ్యాఖ్యలు ఈ అనుమానాలను మరింత చేకూరుస్తున్నాయని అంటున్నారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో రెండు చోట్ల జనసేన గెలవడాన్ని ప్రస్తావిస్తూ "జనసేన పార్టీ ఒక రాష్ట్రానికో ఒక ప్రాంతానికో పరిమితం కాదు" అంటూ పవన్ వ్యాఖ్యానించారు. అంతేకాకుండా తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా తనకు ఆహ్వానాలు ఉన్నాయని చెప్పారు. దీంతో పవన్ తన పార్టీని జాతీయస్థాయికి విస్తరించాలని అనుకుంటున్నారా? అనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. ఉమ్మడి రాష్ట్రంలో 2014లో జనసేన పార్టీని పవన్ కల్యాణ్ ప్రారంభించారు. అదే ఏడాది రాష్ట్ర విభజన జరగడంతో ఆయన రాజకీయ కార్యాకలాపాలకు ఏపీని కేంద్రంగా చేసుకున్నారు. తెలంగాణలో సైతం పార్టీకి చెప్పుకోదగ్గ స్థాయిలో అభిమానులు, కార్యకర్తలు ఉన్నప్పటికీ ఆ రాష్ట్రంలో బలం పెంచుకునే దిశగా ఇప్పటివరకు పవన్ గట్టి చర్యలు తీసుకోలేదనే అభిప్రాయమే ఎక్కువగా ఉందని అంటున్నారు. అయితే తెలంగాణకు చెందిన జనసేన కార్యకర్తలు, నాయకులు మాత్రం ఆ రాష్ట్రంలో రాజకీయంగా ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. 2014లో పార్టీని పెట్టిన ఆ ఏడాది జరిగిన ఎన్నికల్లో జనసేన పోటీకి దూరంగా ఉండిపోయింది. ఇక 2018లో తెలంగాణ ఎన్నికల్లో కూడా అదే వ్యూహం అనుసరించింది. కానీ, 2019 ఎన్నికల్లో ఏపీలో ఒంటరిగా పోటీ చేసి దాదాపు 6 శాతం ఓట్లతో ఉనికి చాటుకుంది. ఇక ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో దీటుగా పోటీ పడింది. ఈ క్రమంలో 2024 ఎన్నికల్లో బలమైన శక్తిగా జనసేన ఎదిగింది. ఆ ఎన్నికల్లో వంద శాతం స్ట్రైక్ రేట్ సాధించిన జనసేనాని పవన్ జాతీయస్థాయిలో అందరి దృష్టిని ఆకర్షించారని అంటున్నారు. ఇక తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సైతం బీజేపీతో పొత్తు పెట్టుకుని పోటీ చేసిన జనసేన చెప్పుకోదగ్గ ఓట్లు తెచ్చుకుంది. అయితే జనసేనాని పవన్ ఎక్కువగా ఏపీపైనే ఫోకస్ చేయడం వల్ల తెలంగాణలో ఆ పార్టీ పెద్దగా పుంజుకోలేకపోతుందని అంటున్నారు. అయినప్పటికీ కేడర్ సొంతంగా పోరాడేందుకు ముందుకు వస్తోందని చెబుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో రెండు స్థానాల్లో గెలవడం, మరికొన్ని స్థానాల్లో బలమైన పోటీ ఇవ్వడంతో తెలంగాణలో పార్టీ భవిష్యత్తుపై కార్యకర్తలు ఆశలు పెంచుకుంటున్నట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో జనసేనాని పవన్ వ్యాఖ్యలు పార్టీలో అంతర్గతంగా విస్తృత చర్చకు దారితీస్తున్నట్లు వ్యాఖ్యానిస్తున్నారు. సినిమా హీరోగా పవన్ కు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో ఆయనకు పెద్ద సంఖ్యలో అభిమానులు ఉన్నారని చెబుతున్నారు. ఈ కారణంగానే బీజేపీ తన పార్టీ కార్యక్రమాలకు, ఎన్నికల ప్రచారానికి పవన్ ను ఎక్కువగా వాడుకుంటోందని అంటున్నారు. గతంలో మహారాష్ట్రలో ఎన్నికల ప్రచారం చేసిన పవన్.. ఆ తర్వాత తమిళనాడు, కర్ణాటక, కేరళల్లో పలు బహిరంగ సభల్లో పాల్గొన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకునే జనసేన ఏ ఒక్క ప్రాంతానికో రాష్ట్రానికో పరిమితం కాదంటూ పవన్ ప్రకటన చేశారని అభిప్రాయపడుతున్నారు. పవన్ తాజా ప్రకటన తర్వాత జనసేనతోపాటు ఇతర పార్టీల్లోనూ పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఏ ఆలోచన లేకుండా పవన్ ఇలాంటి ప్రకటన చేయరని అంటున్నారు. ప్రస్తుతం పవన్ పార్టీకి ఉన్న ఎన్నికల గుర్తు గ్లాసును శాశ్వతంగా పొందాలంటే ఏపీతోపాటు తెలంగాణలోనూ ఓట్లు తెచ్చుకోవాలనేది పవన్ వ్యూహంగా ఉందని అంటున్నారు. ప్రస్తుతం ఏపీ వరకు జనసేన పార్టీకి గ్లాసు గుర్తు అధికారికంగా కేటాయించినట్లు చెబుతున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ గుర్తు విషయంలో తీవ్ర గందరగోళం ఏర్పడిందని గుర్తు చేస్తున్నారు. ఈ పరిస్థితులు పునరావృతం కాకూడదంటే జనసేనకు తెలంగాణలోనూ గుర్తింపు ఉండాలని పవన్ ఆకాంక్షిస్తున్నారు. ఈ దిశగానే జాతీయ పార్టీగా విస్తరించే ఆలోచన చేస్తున్నారని అంటున్నారు.

# ఏజెన్సీలో 'ఎర్ర' దోపిడీ.. చట్టాలకు తూట్లు!

## ముసురుమిల్లి కాలువపై అక్రమ వంతెన నిర్మాణం.. గట్టుపై యథేచ్ఛగా రోడ్డు - 1/70 చట్టం గాలికి.. అధికారుల పర్యవేక్షణ నీలికి జేబులు నింపుకునే పనిలో ప్రజాప్రతినిధులు? - దేవీపట్నం ఏజెన్సీలో రెచ్చిపోతున్న మట్టి మాఫియా







**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ - ప్రతినిధి :** గిరిజనుల హక్కులను కాపాడాల్సిన 1/70 చట్టం ఏజెన్సీలో అపహాస్యం పాలవుతోంది. పచ్చని ప్రకృతికి నిలయమైన మన్యం.. అక్రమార్కుల పాలిట కాసుల వర్షం కురిపించే గనిగా మారుతోంది. "ప్రకృతిలో ఉన్న ప్రతీ వస్తువునూ గిరిజనులు దైవంగా భావిస్తే.. అదే ప్రకృతి సంపదను కొల్లగొట్టడాన్ని కొందరు నాయకులు, వ్యాపారులు హక్కుగా భావిస్తున్నారు". దేవీపట్నం మండలంలో ప్రస్తుతం జరుగుతున్న ఎర్రమట్టి దందా దీనికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది.

**కళ్ళు మూసుకున్న అధికార యంత్రాంగం**

దేవీపట్నం మండలం, ఇందుకూరు పంచాయతీ పరిధిలోని చిన్న బీంపల్లి గ్రామంలో ఎర్రమట్టిని తరలించేందుకు వ్యాపారులు బరితెగించారు. కేవలం మట్టిని తరలించడమే కాదు, అందుకోసం ప్రభుత్వ ఆస్తులను సైతం తమ సొంత జాగీరులా వాడుకుంటున్నారు. ఎర్రమట్టి రవాణా కోసం ఏకంగా 'ముసురుమిల్లి పంట కాలువ'పై అక్రమంగా ఒక వంతెనను నిర్మించారంటే వీరి వెనుక ఎంతటి బలమైన హస్తం ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాకుండా, కాలువ గట్టుపై భారీ వాహనాలు వెళ్లేందుకు వీలుగా పటిష్టమైన రహదారిని కూడా నిర్మించుకున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులు గానీ, జలవనరుల శాఖ అధికారులు గానీ ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఆంతర్యమేమిటని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు.

**నాయకుల కనుసన్నల్లోనే..**

ఈ అక్రమ వ్యవహారం అంతా స్థానిక ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే జరుగుతోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. గిరిజన చట్టాలను కాపాడాల్సిన వారే, కాసులకు కక్కుర్తి పడి మట్టి మాఫియాకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. "జేబులు నింపుకోవడమే పనిగా పెట్టుకున్న కొందరు నేతలు, ఏజెన్సీ చట్టాలకు పాతర వేస్తున్నారు" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చట్టం ఏం చేస్తోంది?**

గిరిజన ప్రాంతాల్లోని వనరులను కాపాడేందుకు ప్రభుత్వం 1/70 చట్టాన్ని తెచ్చింది. కానీ, క్షేత్రస్థాయిలో ఈ చట్టం అమలు తీరు ప్రశ్నార్థకంగా మారింది. అధికారులు ఇకనైనా మేల్కొని, ముసురుమిల్లి కాలువపై నిర్మించిన అక్రమ వంతెనను తొలగించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటారా? లేక రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి మట్టి దోపిడీకి మౌన సాక్షిగా నిలుస్తారా? అనేది వేచి చూడాలి.

**అధికారులూ.. సమాధానం చెప్పండి!**

1. అనుమతులు ఉన్నాయా?:పంట కాలువపై వంతెన నిర్మించడానికి, గట్టును రోడ్డుగా మార్చడానికి ఇరిగేషన్ శాఖ అనుమతి ఇచ్చిందా?

2 మైనింగ్ రాయల్టీ ఎక్కడ?: తరలిపోతున్న ఎర్రమట్టికి ప్రభుత్వానికి ఎంత ఆదాయం (రాయల్టీ) వస్తోంది? లేక అంతా బ్లాక్ మార్కెట్టేనా?

3. 1/70 చట్టం ఎక్కడ?: ఏజెన్సీలో గిరిజనేతరులు, వ్యాపారులు ఇంత యథేచ్ఛగా కార్యకలాపాలు సాగిస్తుంటే చట్టం ఎందుకు మౌనంగా ఉంది?

### ఏఐ వాడకంలో

# అప్రమత్తత అవసరం

## కేంద్రమంత్రి జితిన్ ప్రసాద



**విశ్వం వాయిస్ న్యూస్ :** అన్ని రంగాల్లో కృత్రిమ మేధ వినియోగం రోజు రోజుకూ పెరుగుతోంది. దీనివల్ల అనేక ప్రయోజనాలు ఉన్నప్పటికీ ఏఐను దుర్వినియోగం చేయడం వల్ల తీవ్ర పరిస్థితులు ఏర్పడుతాయని ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సహాయ మంత్రి జితిన్ ప్రసాద హెచ్చరించారు. ఏఐ వాడకంలో అప్రమత్తత అవసరమని..దీనిని తప్పుడు సమాచార వ్యాప్తి కోసం వాడితే దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. ఢిల్లీలో నేడు ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ ప్రారంభం కానున్న నేపథ్యంలో.. నిర్వహించిన ఓ కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏఐ ద్వారా విద్య, వైద్య, వ్యవసాయం, పరిపాలన వంటి అన్ని రంగాల్లో పనులు సులభమవుతున్నాయని కేంద్రమంత్రి పేర్కొన్నారు. కాబట్టి దేశప్రజలందరూ కృత్రిమ మేధపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ వంటి అధిక జనాభా గల దేశాల్లోని ప్రజలకు డిజిటల్ అక్షరాస్యత లేకపోతే సైబర్ నేరాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కాబట్టి కృత్రిమ మేధ వినియోగంపై పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. పాఠ్యాంశాల్లో ఈ సమాచారాన్ని పొందుపరచాలన్నారు.

### మామిడికుదురు అగ్ని ప్రమాద బాధితులను

# పరామర్శించిన ఎంపీ హరీష్ బాలయోగి

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మామిడికుదురు గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబాలను అమలాపురం పార్లమెంట్ సభ్యుడు ఎంపీ హరీష్ బాలయోగి పరామర్శించారు. గ్రామంలోని ఆల్ కాస్ట్ కాలనీలో గ్యాస్ సిలిండర్ పేలుడు కారణంగా సుమారు 12 కుటుంబాలు తమ ఇళ్లను కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై వెంటనే స్పందించిన ఎంపీ హరీష్ బాలయోగి బాధితులను ప్రత్యక్షంగా కలిసి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికంగా గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్‌లతో మాట్లాడి సమస్యలపై సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుని ప్రతి కుటుంబాన్నీ ఆదుకుంటుందని ఆయన భరోసా ఇచ్చారు. కొన్ని



కుటుంబాలకు ఇప్పటికే స్థలాలు కేటాయించినట్లు ఎంపీ వెల్లడించారు. బాధిత కుటుంబాలంతా ఒకే చోట నివాసం ఉండేలా చూడాలని వారు కోరుకున్న నేపథ్యంలో, అందుకు అనువైన భూమి లభ్యతపై అధికారులు పరిశీలిస్తున్నారని తెలిపారు. తాను స్వయంగా స్థలాలను పరిశీలించి అదనపు భూమి అందుబాటులో ఉన్నట్లు గమనించానని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ప్రస్తుతం బాధిత కుటుంబాలకు సమీపంలోని పాఠశాల భవనంలో తాత్కాలిక ఆశ్రయం కల్పించబడింది. వారికి రోజువారీ భోజనం, నిత్యావసర సరుకులు, దుస్తులు తదితర అవసరాలను ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సమకూరుస్తోందని ఎంపీ తెలిపారు. బాధితులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. బాధితులు కోరిన మేరకు తాత్కాలిక నివాసాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని నిర్ణయించగా, జనసేన పార్టీ ప్రతినిధులు ఒక వారంలో షెల్టర్ పనులను పూర్తి చేస్తామని ముందుకు వచ్చినట్లు ఎంపీ తెలిపారు. ఈ సహకారానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంపీ హరీష్ బాలయోగి చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, ఇతర అవసరమైన సామగ్రిని పంపిణీ చేశారు. బాధితుల పట్ల సానుభూతి వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం వారి పక్కనే నిలబడి సంపూర్ణ సహాయం అందిస్తుందని ఎంపీ హరీష్ బాలయోగి మరొక్కసారి భరోసా ఇచ్చారు.

### కష్టకాలంలో ఉన్న ఇరువురు మహిళలకు

# అండగా మంత్రి సుభాష్

## ఇద్దరు మహిళలకు రూ.30 వేల ఆర్థిక సహాయం



**కె.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజక వర్గం కె.గంగవరం మండలానికి చెందిన ఇరువురు నిరుపేద మహి ళలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మానవతా దృక్పథంతో రూ.30 వేల ఆర్థిక సహాయం అందించారు. వివరాల్లోకి వెళితే దంగేరు గ్రామానికి చెందిన మాతా అంజలీదేవి భర్త మరణిం చడంతో ఆమె ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆమె పరిస్థితిని తెలుసుకున్న మంత్రి సుభాష్ వెంటనే స్పందించి రూ.20 వేలు చెక్కును ఆర్థిక సహాయంగా అందజేశారు. అలాగే కోట గ్రామం శివారు రాజవైరి ప్రాంతానికి చెందిన రాగాపు పద్మ భర్త అనారోగ్యంతో మరణించగా, ఆమెకు కూడా రూ.10 వేలు ఆర్థిక సహాయం కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం చేతుల మీదుగా అందించారు. కష్టకాలంలో తమను ఆదుకుని అండగా నిలిచిన మంత్రి సుభాష్‌కు ఇరువురు మహిళలు, కూటమి పార్టీ నాయకులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలిసిన వెంటనే స్పందిస్తూ సహాయం చేయడం మంత్రి సుభాష్ మానవత్వానికి నిదర్శనమని కొనియాడారు.

# కూనవరం మొగ తవ్వాలని మత్స్యకారులు మహాధర్నా

## అక్రమ చెరువులను ధ్వంసం చేయాలని పిలుపు

**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా, కాట్రేనికోన మండలంలో సముద్ర తీర మత్స్యకార గ్రామాలు ఎక్కువగా ఉంటాయి. వీరిలో ఎక్కువ శాతం పఱ్ఱ భూమిలో ఉండే చేపలను వేటాడి జీవనం కొనసాగిస్తూ ఉంటారు. గత నాలుగేళ్లుగా కూనవరం స్ట్రెయిట్ కట్ మూసుకుపోయింది. దీంతో సముద్ర జలాలు పరలోకే రావడం లేదు. దీంతో పఱ్ఱ ఎండిపోయింది. మత్స్యకారులకు చేపల వేటకు బ్రేక్ పడింది. వీరంతా వలస బాట పట్టారు. దీంతో సోమవారం మూసుకుపోయిన మొగ వద్ద మహాధర్నా నిర్వహించారు. సుమారు 3,000 మంది మత్స్యకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కుటుంబ పెద్దలతో పాటు మహిళలు, పిల్లలు కూడా ఈ ధర్నాలో పాల్గొన్నారు. మొగ తవ్వాలంటూ నినాదాలు చేశారు. అనంతరం మత్స్యశాఖ కార్పొరేషన్ మాజీచైర్మన్ నాగిడి నాగేశ్వరరావు ఆందోళన కార్లను ఉద్దేశించి మాట్లాడారు. మొగ మూసుకుపోవటం వల్ల చిర్రయానం, గచ్చుకాయలు పోర, పల్లం, నీళ్లరేవు, గెద్దనపల్లి, తదితర గ్రామాలకు చెందిన మత్స్యకారులు చేపల వేట లేక ఆర్థికంగా చితకు పోతున్నారని, సుమారు 2300ఎకరాలు కలిగిన పఱ్ఱ భూమి ఆక్రమణలకు గురైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పఱ్ఱ భూములో అక్రమ రొయ్యల చెరువులను గుర్తించి ధ్వంసం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంతేకాకుండా మొగ మూసుకుపోకుండా




ప్రభుత్వం శాశ్వత ప్రణాళికరూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాలకు చెందిన మత్స్యకారులు పాల్గొన్నారు.

### బాధితుల సమస్యలకు సత్వర

# న్యాయం అందించడమే లక్ష్యం : జిల్లా ఎస్పీ రాహుల్ మీనా



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

జిల్లా ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలనే లక్ష్యంతో సోమవారం అమలాపురంలోని జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పి రాహుల్ మీనా, ఐపీఎస్ అధ్యక్షత వహించగా, అడిషనల్ ఎస్పి ఏవీఆర్‌పీబీ ప్రసాద్ పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన బాధితులు తమ అర్జీలను ఎస్పి దృష్టికి తీసుకువచ్చారు. ఎస్పి ప్రతి అర్జీదారునితో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను సానుకూలంగా, క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 31 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రధానంగా భూ తగాదాలు, కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాలు, సివిల్ తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా నమోదయ్యాయి. స్వీకరించిన ఫిర్యాదులను తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపించి, వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా విచారణ జరపాలని అధికారులకు ఆదేశించారు. చట్టపరిధిలో బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం కలిగించేలా ప్రతి ఫిర్యాదును పారదర్శకంగా పరిష్కరిస్తామని ఎస్పి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి ఏవీఆర్‌పీబీ ప్రసాద్‌తో పాటు పోలీస్ కార్యాలయ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### రామచంద్రపురం నియోజవర్గంలో

# తెలుగుదేశం పార్టీకి పెరుగుతున్న ఆదరణ

## కోట గ్రామంలో వైసీపీకి భారీ షాక్ - మంత్రి సుభాష్ సమక్షంలో 50 మంది కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరిక



**కె.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం నియోజవర్గం, కె.గంగవరం మండలం కోట గ్రామం శివారు రాజవైరిలో రాజకీయ పరిణామాలు వేగం పుంజుకున్నాయి. గ్రామానికి చెందిన 50 మంది వైసీపీ కార్యకర్తలు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో ఘనంగా చేరారు. పార్టీలో చేరిన వారందరికీ మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యం పార్టీ కండువాలు వేసి ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతాయని, ప్రజల నమ్మకానికి అనుగుణంగా పాలన కొనసాగుతుందని తెలిపారు. గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమం కోసం ఎక్కడా లేని విధంగా ప్రమాద బీమా అమలు చేస్తున్నామన్నారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీకి రోజురోజుకీ ఆదరణ పెరుగుతుందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారంతా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. మంత్రి సుభాష్ నాయకత్వంలో రామచంద్రపురం నియోజవర్గాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, మలకల విశ్వేశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు మలకల రామచంద్రరావు, కాటే సుబ్రమణ్యం, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు తలపట్ల ఆనందరావు, నియోజవర్గ రైతు అధ్యక్షులు బలుసు శివప్రసాద్, దంగేటి నాగేశ్వరరావు, జుత్తుక శ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ చేరికలతో కోట గ్రామంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అయిందని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. తొలుత గ్రామంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి మంత్రి సుభాష్, వాసంశెట్టి సత్యంలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

### బుద్ధిస్టే సొసైటీ ఆఫ్ ఇండియా

# ఆంధ్రప్రదేశ్ 2026 ప్రీ క్యాలెండర్ ఆవిష్కరణ



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ద బుద్ధిష్ట్ ఆఫ్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏపీ ఫ్రీ కాలెండర్ డిస్ట్రిబ్యూషన్ విద్యకు బోధన ఎంత అవసరమో మతవ్యాప్తికి ప్రసారం కూడా అంతే అవసరం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్. బిఎస్ఐ జిల్లా అధ్యక్షులు కుశలరత్న బోధి. రాష్ట్ర అధ్యక్షులు నేషనల్ ట్రస్ట్ హృదయ రత్న బోధి.బౌద్ధ దమ్మ ప్రచారంలో భాగంగా కొత్తపేట మండలం కొత్తపేట బాబా నగర్ కాలనీ ఉన్న డాక్టర్ భీమ్రావు అంబేద్కర్ విగ్రహం వద్ద బుద్ధిస్టే సొసైటీఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ 2026 ఫ్రీ క్యాలెండర్ ని బాబా నగర్ యూత్ ఆధ్వర్యంలో పొలమాటి రాము. కాశిరాజు మంగం అఖిల్ కుమార్.మెట్టి గణేష్ బోలాసుబ్బారావు మెట్టు భాస్కర్ రావు పాల్గొనీ విజయవంతం చేశారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆలమూరు మండలం చెముడులంక బస్ స్టాండ్ సెంటర్లో దూలం వెంకటేశ్వర్లు (53) తండ్రి సుబ్బారావు చెముడులంక హైవే రోడ్డు దాటుతుండగా రావులపాలెం నుండి రాజమండ్రి వెళుతున్న బొలోరో వేగంగా కొట్టడంతో వెంకటేశ్వర్లు కింద పడిపోయాడు గ్రామస్తులు వెంటనే వెంకటేశ్వర్లు కుటుంబానికి సమాచారం తెలియపరచి ప్రభుత్వ ఆసుపత్రికికి తరలించారు. ఈనెల 16న హాస్పటల్లో వెంకటేశ్వర్లు మృతి చెందినట్లు ఎస్సై తెలియజేశారు. పూర్తి వివరాలు దర్యాప్తులో వెల్లడిస్తామని ఎస్సై నరేష్ తెలియజేశారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 170 అర్జీల స్వీకరణ

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

అర్జీదారుల సమస్యలను అధికారులు తమ స్వంత సమస్యలుగా భావించి శతశాతం నాణ్యమైన పరిష్కార మార్గాలు చూపుతూ వారి సంతృప్తి స్థాయిని మెరుగుపరచడమే లక్ష్యంగా పనిచేయాలని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి. మమ్మీ సూచించారు. సోమవారం అమలాపురం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొని జిల్లాస్థాయి అధికారులతో కలిసి సుమారు 170 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అర్జీకి సమయానుకూలంగా పరిష్కారం చూపాలని, పారదర్శకతతో కూడిన వేగవంతమైన స్పందన ద్వారా నాణ్యమైన సేవలు అందించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదైన ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా పరిశీలించి, నిర్దిష్ట కాలపరిమితిలో సంతృప్తికర పరిష్కారం అందించడం అధికారుల ప్రధాన కర్తవ్యమని పేర్కొన్నారు. అర్జీదారుల సంతృప్తి స్థాయిని పెంపొందించడమే పరిపాలనా లక్ష్యమని, సమయపాలనతో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీదారుల స్వరాన్ని ప్రభుత్వానికి చేరవేసే బలమైన సాధనమని ఆమె అన్నారు. ప్రతి అర్జీకి శ్రద్ధ, ప్రతి సమస్యకు పరిష్కారం చూపడమే ధ్యేయంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత శాఖాధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సంబంధిత భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా 'రెవెన్యూ క్లినిక్' నిర్వహిస్తున్నట్లు



తెలిపారు. మండల రెవెన్యూ అధికారులు, డిప్యూటీ తహసీల్దారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సర్వేయర్లు, విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లు తదితర సిబ్బంది అందుబాటులో ఉంటారని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తామని తెలిపారు. కొన్ని ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి, మిగిలిన వాటికి గడువు తెలియజేస్తామని చెప్పారు. అర్జీదారులు 'మీ కోసం' కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అర్జీలు ఇంకా పరిష్కారం కాలేకపోయినా, ఫిర్యాదుల స్థితిగతులపై సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అలాగే తమ అర్జీలను నమోదు చేసుకోవడానికి మీకోసం యాప్ జిఓవి.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే సమస్యలపై ప్రభుత్వం ప్రత్యక్ష పర్యవేక్షణ చేస్తోందని, ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరిస్తోందని పేర్కొన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, నిబంధనల మేరకు పరిష్కారం కాని సందర్భంలో కారణాలను స్పష్టంగా వివరించాలని సూచించారు. ముఖ్యంగా భూ సంబంధిత ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ భూ రికార్డులను పరిశీలించి, ప్రభుత్వ వద్ద ఉన్న సమాచారంతో సమన్వయం చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించరాదని, మండల స్థాయి అధికారులు కింది స్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుని సమర్థవంతంగా పనిచేయాలని తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫిర్యాదులను ముగించడంలో అత్యుత్సాహం ప్రదర్శించకుండా, నాణ్యమైన పరిష్కారం అందించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ వేదిక ద్వారా ప్రజలు భూ సమస్యలు, ఆదాయ ధృవపత్రాలు, పింఛన్లు, రేషన్ కార్డులు, తాగునీరు, రహదారులు తదితర అంశాలపై వినతిపత్రాలు సమర్పించినట్లు తెలిపారు. ప్రతి అభ్యర్థనను శ్రద్ధగా విని, నిర్దిష్ట గడువులో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని పేర్కొంటూ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రభుత్వం ప్రజల మధ్య నమ్మకాన్ని మరింత బలపరచాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించి ప్రతి సమస్యకు సమయానుకూల పరిష్కారం అందించేందుకు కట్టుబడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎల్డీవోలు రాజేశ్వరరావు, వేణుగోపాలరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానం నందు త్రిశూల స్నానం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామి వారి దేవస్థానం నందు ది.18-02-2026 బుధవారం వరకు శ్రీ ఉమా మందేశ్వర స్వామి, శ్రీ ఉమా బ్రహ్మేశ్వర స్వామి వారి, శ్రీ ఉమా నాగేశ్వర స్వామి వార్ల వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవములలో భాగంగా ది.17-02-2026 మంగళవారం ఉదయం 10 గంటలకు త్రిశూల స్నానం ఏనుగులమహాల్ శ్రీ సుబ్రహ్మేశ్వర ఆలయం ఘాట్ వద్ద జరుగును. కావున ఈ కార్యక్రమములో పాల్గొని, శ్రీ స్వామి వార్ల, అమ్మవార్ల తీర్థ ప్రసాదములు స్వీకరించవలసినదిగా దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది మిత్రులందరికీ ఆహ్వానం తెలియజేస్తూ, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసినదిగా కోరడమైనది అని దారపురెడ్డి సురేష్ బాబు, సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

# అగ్ని ప్రమాద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటాము



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మోడేకుర్రు అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొత్తపేట మండలం మోడేకుర్రులో ముత్యాలమ్మ గుడి వీధిలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని కొత్తపేట ఎమ్మెల్యే అన్నారు. ఆదివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ వల్ల పక్కనే ఉన్న తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. ఈ అగ్ని ప్రమాద ఘటనలో సర్వం కోల్పోయిన మోకా నాగలక్ష్మి, లేళ్ళ దుర్గాప్రసాద్, లేళ్ల రామకృష్ణ, యాళ్ల నాగులను ఆయన పరామర్శించి బాధితులకు ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం తరపున అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటామన్నారు.ప్రభుత్వం నుంచి అన్ని సహాయ సహకారాలు బాధితులకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# ఏపీలో అభివృద్ధి సంక్షేమమే చంద్రబాబు ధ్యేయం

## రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్

**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభివృద్ధి చేస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. కాజులూరు మండలం మంజేరు, చేదువాడ గ్రామాల్లో సుమారు రూ.2 కోట్లు 40 లక్షల నిధులతో నిర్మించనున్న పలు రహదారి అభివృద్ధి పనులకు సోమవారం ఆయన భూమి పూజలు చేశారు. ఉండూరు బ్రిడ్జి నుంచి పటవల వరకు రూ.2 కోట్ల రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గొల్లపాలెం కుయ్యేరు రోడ్డు పరిధిలో (చేదువాడ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు) వరకు రూ. 40 లక్షలుతో నిర్మించనున్న రహదారి



పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారుల నిర్మాణం కీలకమని కూటమి ప్రభుత్వ కృషితో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, టీడీపీ నాయకులు దడాల నాగార్జున, ఆర్‌డబీ ఏఈ లక్ష్మీప్రసన్న, కాజులూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు బొండా వెంకన్న, అమలాపురం పార్లమెంట్ జిల్లా అధికార ప్రతినిధి వనుం వీరబ్రహ్మం, క్లస్టర్ ఇంచార్జ్ రెడ్డి శేషరావు, సలాది సాయిబాబా, పలివెల రాజు, వల్లు అర్జునరావు, మంజేరు ఎంపీటీసీ గండి మణికంఠ, సొసైటీ ధర్మరాజు, కోలంక సొసైటీ అధ్యక్షులు బొండా వెంకట నరసింహా నాయుడు,కాజులూరు డీసీ కృష్ణ చైతన్య, టీడీపీ నాయకులు వేగుబంట్ల శ్రీరామచంద్రమూర్తి, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు

# రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టే బడ్జెట్లు...!



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశ పెట్టిన బడ్జెట్, ఫిబ్రవరి 14న రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ కేటాయింపులను పరిశీలిస్తే కేంద్రం, రాష్ట్రం సమన్వయంతో పనిచేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోందని కాకినాడ జిల్లా భారతీయ జనతా పార్టీ పూర్వ అధ్యక్షులు చిలుకూరి రాంకుమార్ పేర్కొన్నారు. ఈ డబుల్ ఇంజన్ సర్కార్ ఫలాలు త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రజలకు అందనున్నాయని రాంకుమార్ హర్షం వ్యక్తం చేసారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తాజా బడ్జెట్లపై తన అభిప్రాయాలను ఓ ప్రకటనలో మీడియాకు సోమవారం వెల్లడించారు. రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఆర్థిక విచ్ఛిన్నం చోటుచేసుకుందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రాన్ని ఆర్థికంగా గాడిలో పెట్టే దిశగా వేసిన మంచి అడుగుగా భావిస్తున్నానని తెలిపారు. రాజధాని నిర్మాణానికి రూ. 6,000 కోట్లు, విద్యుత్ రంగానికి రూ.13,934 కోట్లు, రోడ్లు,పోర్టుల అభివృద్ధికి రూ. 13,546 కోట్లు, వైబీజీ రాంజీ పథకానికి రూ. 8,365 కోట్లు, ఎన్టీఆర్ వైద్య సేవకు రూ. 4,000 కోట్లు, జలజీవన్ మిషన్‌కు రూ. 4,000 కోట్లు, స్వచ్ఛభారత్‌కు రూ.1,037 కోట్లు కేటాయించడం ఆహ్వానించదగిన పరిణామమని పేర్కొన్నాను. అలాగే ప్రాంతీయ అసమానతలపై దృష్టి సారించి ఉత్తరాంధ్రకు రూ. 28,000 కోట్లు, రాయలసీమకు రూ. 30,000 కోట్లు కేటాయించడం శుభపరిణామమని, ప్రభుత్వం రెవెన్యూ లోటు, ద్రవ్యలోటును పూడ్చుకునే దిశగా ఆదాయ మార్గాలపై కూడా దృష్టి సారిస్తుందని కాకినాడ జిల్లా భారతీయ జనతా పార్టీ పూర్వ అధ్యక్షులు చిలుకూరి రాంకుమార్ తన ఆశాభావాన్ని వ్యక్తం చేసారు.

# నెల్లిపూడిలో భారీ అన్నసంతర్పణ

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం నెల్లిపూడిలోని శ్రీ శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పూజలను నిర్వహించారు. మహాశివరాత్రి వేడుకలకు



కొనసాగింపుగా సోమవారం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శంఖవరం మండలం జనసేన పార్టీ ఉపాధ్యక్షులు, నెల్లిపూడి పార్టీ అధ్యక్షుడు తలపంటి అప్పారావు (బుజ్జి) పులిహోరను విరాళంగా సమర్పించారు. ఈ కార్యక్రమంలో నెల్లిపూడి గ్రామ ప్రజలు అలాగే జనసేన నాయకులు, కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.

# ఆర్యవటంలో ఘనంగా ముగిసిన సప్తాహ మహోత్సవములు



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాజులూరు మండలం ఆర్యవటం ముత్తావారి గరువు రామాలయం లో నిర్వహించిన సప్తాహ మహోత్సవములు ఘనంగా జరిగాయి. సామరసత సేవ ఫౌండేషన్ మండల కన్వీనర్ కంచి గోవిందరాజు, గ్రామస్తులు సంయుక్త ఆధ్వర్యంలో శివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన సప్తాహ మహోత్సవ కార్యక్రమంలో ఏడు రోజుల పాటు నిర్విరామంగా భజన కార్యక్రమాల్ని కొనసాగించి సోమవారంతో ముగించారు. ఈ సందర్భంగా కంచి గోవిందరాజు మాట్లాడుతూ ఆర్యవటం గ్రామ ప్రజలందరి సహాయ సహకారాలతో నిర్విరామంగా ఏడు రోజులపాటు పరిసర గ్రామాల నుండి భజన బృందాలు వచ్చి రాత్రి పగలు భగవన్నామ సంకీర్తనలతో భక్తులను పులకింప చేశారన్నారు. ప్రతి ఒక్కరు దైవ నామస్మరణ వల్ల మానసిక ప్రశాంతతను పొందటమే గాక ఇటువంటి మహోత్కరమైన దైవ కార్యాలలో పాల్గొనడం ఆ పరమేశ్వరుని కృపకు పాత్రులు అవుతారని అన్నారు. ఏమేరకు సోమవారం సుమారు ఐదువేల మందికి అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పరిసర గ్రామాల ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### విద్యార్థులకు అలర్ట్..

# ఇక ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో 32 పేజీల బుక్‌లెట్!



రాష్ట్రంలో ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహనకు ఇంటర్మీడియట్ విద్యా మండలి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఏడాది ఇంటర్ ఫస్ట్ ఇయర్ 5,31,275 విద్యార్థులు, సెకండ్ ఇయర్‌లో 5,26,624 మంది వరకు విద్యార్థులు పరీక్షలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఫిబ్రవరి 23 నుంచి ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండ్ ఇయర్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహనకు ఇంటర్మీడియట్ విద్యా మండలి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఏడాది ఇంటర్ ఫస్ట్ ఇయర్ 5,31,275 విద్యార్థులు, సెకండ్ ఇయర్‌లో 5,26,624 మంది వరకు విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. అంటే మొత్తం 10,57,899 మంది పరీక్షలకు హాజరు కానున్నారన్నమాట. అయితే ఈ ఏడాది ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో పలు కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. ఫస్ట్ ఇయర్ సిలబస్‌తోపాటు ప్రశ్నపత్రాల విధానంలోనూ కీలక మార్పులు తీసుకొచ్చారు. సమాధానాలు రాయడానికి ఇప్పటి వరకు 24 పేజీల బుక్‌లెట్ ఇచ్చేవారు. అయితే ఈసారి ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు 32 పేజీల బుక్‌లెట్ ఇవ్వనున్నట్లు బోర్డు తెలిపింది. క్వశ్చన్ పేపర్‌లోని అన్ని ప్రశ్నలకు అందులోనే జవాబులు రాయాల్సి ఉంటుంది. బుక్‌లెట్ నిండిన వారికి అదనంగా ఎలాంటి అడిషనల్ పేజీలు ఇవ్వరు. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టుల్లో ప్రశ్నల సంఖ్య పెరగడమే అందుకు కారణం. ఇందుకు అనుగుణంగా బుక్‌లెట్‌లో పేజీలు కూడా పెంచారు. ఛాయిస్ లేకుండా క్వశ్చన్ పేపర్‌లో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసినా 28 పేజీలు సరిపోతాయి. అందుకోసమే 32 పేజీల బుక్‌లెట్ తీసుకొచ్చినట్లు ఇంటర్ బోర్డు పేర్కొంది. ఇక ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు మాత్రం గతంలో మాదిరిగానే 24 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. గతంలో బోటనీ, జువాలజీలకు విడివిడిగా పరీక్షలు నిర్వహించేవారు. ఈ ఏడాది నుంచి రెండింటినీ కలిపి బయాలజీగా ఒక్క ప్రశ్నపత్రమే ఇస్తారు. పార్ట్-ఏలో వృక్ష శాస్త్రం నుంచి 43, పార్ట్ బీలో జంతుశాస్త్రం నుంచి 42 మార్కులకు ప్రశ్నలు వస్తాయి. వీటికి విడివిడిగా 24 పేజీల రెండు బుక్‌లెట్లు ఇస్తారు. బుక్‌లెట్లపై వృక్ష శాస్త్రం, జంతుశాస్త్రం అని ప్రత్యేకంగా ఉంటుంది. అంతేకాకుండా ఈ ఏడాది నుంచి ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఒక్క మార్కు ప్రశ్నలు ఉంటాయి. సెకండ్ ఇయర్ విద్యార్థులకు మాత్రం ప్రశ్నపత్రాల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఎకనామిక్స్, హిస్టరీ, పాలిటిక్స్ సబ్జెక్టులకు కూడా ప్రశ్నల సంఖ్య పెరగడంతో వీటికి సైతం 32 పేజీల బుక్‌లెట్ ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టులకు ఫస్ట్ ఇయర్‌లో 85 మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. వీటిల్లో 35 శాతం మార్కులొస్తేనే పాసైనట్లు పరిగణిస్తారు. అంటే ఒక్కో సబ్జెక్టులో 29 మార్కులు రావాల్సి ఉంటుంది. సెకండ్ ఇయర్‌లో 85 మార్కులకు 30 మార్కులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. రెండు సంవత్సరాలకు కలిపి 35 శాతం కింద అంటే 59.5 మార్కులు సాధిస్తే ఉత్తీర్ణులుగా పరిగణిస్తారు.

### అయ్యో భగవంతుడా.. తెల్లారితే పంక్షన్..

# మృత్యువుగా మారిన గ్రైండర్..

ఏలూరు జిల్లాలో ఒక ఫంక్షన్‌లో విషాదం చోటుచేసుకుంది. మేన మామ ఇంట్లో పంక్షన్ కు వెళ్లిన.. 11 ఏళ్ల పిల్లవాడికి విద్యుత్ షాక్ తగలి.. మృతి చెందాడు. శుభకార్యంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంతో తల్లిదండ్రులు, బంధువులు అందరూ



కన్నీరు మున్నీరుగా విలపించారు. వేడుకలైనా.. శుభకార్యాలైనా..? ఎక్కడైనా.. పిల్లలదే కదా సరదా సందడి.. వారు లేకపోతే.. ఎలాంటి హడావుడి ఉండదు.. వంటశాలల నుంచి వేడుక మండపం వరకు కలియతిరిగుతూ.. తమ ఆటలతో హడావుడి చేస్తుంటారు. ఇక తొలి బంతిలో కూర్చుని భోజనం చేయడమంటే పిల్లలకు మరింత సరదాగా ఉంటుంది.. అయితే, ఏలూరు జిల్లాలో ఇలాంటి ఒక ఫంక్షన్ లో విషాదం చోటుచేసుకుంది. మేనమామ ఇంట్లో పంక్షన్ కు వెళ్లి.. 11 ఏళ్ల పిల్లవాడికి విద్యుత్ షాక్ తగలి.. మృతి చెందాడు. శుభకార్యంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంతో.. తల్లిదండ్రులు సహా అందరూ కన్నీరుమున్నీరుగా విలపించారు.

**అసలేం జరిగిందంటే..**

జంగారెడ్డిగూడెం మండలం రామానుజపురానికి చెందిన చంద్రరావు, లలిత దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరి చిన్న కొడుకు సుశాంత్ ఆరవ క్లాస్ చావుతున్నాడు. వాళ్ల మామయ్య మధు ఇంట్లో ఫంక్షన్ కోసం వెళ్ళాడు. ఫంక్షన్ కోసం.. వంటవాళ్ళు అందరూ హడావుడిగా ఎవరి పనుల్లో వాళ్ళు వున్నారు. అదే సమయంలో మసాలా రుబ్బడానికి గ్రైండర్ ను కూడా సిద్ధం చేసారు. ఆ సమయంలో అక్కడకు వెళ్లిన సుశాంత్ పొరపాటున గ్రైండర్ వైర్ ను పట్టుకున్నాడు. అది కట్ అయి ఉండటంతో విద్యుత్ ప్రవహించి సుశాంత్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అక్కడికక్కడే కుప్పకూలాడు.. సుశాంత్ ను గమనించిన బంధువులు వెంటనే అతడిని జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే సుశాంత్ చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. ఇంటినిండా బంధువులు, తెల్లవారితే సుశాంత్ మావయ్య కూతురి ఫంక్షన్.. కానీ సుశాంత్ మృతితో బంధువర్గం మొత్తం విషాదంలో మునిగిపోయింది. పండుగ వాతవారణం కనుమరుగై రోదనలతో అందరూ తమగుండేలు పగిలేలా రోదించారు. ఒక చిన్న ఏమరపాటు, నిర్లక్ష్యం ఒక చిన్న పిల్లవాడి ప్రాణం తీసింది. ఎలక్ట్రికల్ వర్కర్స్, ప్లంబర్స్, కార్పెంటర్స్ లో కొందరు తమ వద్ద ఉన్న ఎలక్ట్రికల్ వస్తువల పట్ల నిర్లక్ష్యంగా ఉంటారు. తెగిపోయిన వాటికి పడే పదే ప్లాస్టర్ వేస్తుంటారు. వర్క్ చేసే సమయంలో, తరలించే సమయంలో అవి విడిపోవటం లూజ్ గా ఉండటం జరుగుతుంది. అయితే ఇది గమనించకపోతే ఇలాంటి ఘటనలే జరిగే అవకాశముందని పేర్కొంటున్నారు.

# 9 క్యారెట్లలో ఎంత బంగారం ఉంటుంది..? దాన్ని ఎలా తయారు చేస్తారు?

సాధారణంగా బంగారంలో 24,22 క్యారెట్లను ఎక్కువగా ఉపయోగిస్తుంటాము. అయితే 9 క్యారెట్ల బంగారం గురించి మీకు తెలుసా? ఈ క్యారెట్లలో ఎంత బంగారం ఉంటుంది? దానిని ఎలా తయారు చేస్తారు..? ఈ క్యారెట్లతో నగలను తయారు చేసుకోవచ్చు..? అందులో ఎలాంటి లోహాలు కలుస్తాయో తెలుసుకుందాం... ఈ రోజుల్లో బంగారం ధర నిరంతరం పెరుగుతోంది. దీని కారణంగా బంగారం సామాన్యులకు అందనంత దూరంలో ఉంది. కానీ సామాన్యులు బంగారు ఆభరణాలను కొనుగోలు చేయగల చౌకైన, మన్నికైన ఎంపిక ఉంది. బంగారు ఆభరణాలు వివిధ స్థాయిల స్వచ్ఛతలో వస్తాయి. ఉదాహరణకు అందరు తరచుగా 22 క్యారెట్లు,



24 క్యారెట్ల గురించి చర్చిస్తాము. కానీ 9 క్యారెట్ల బంగారం కూడా బాగా ప్రాచుర్యం పొందుతోంది. ఇది రోజువారీ ఉపయోగం కోసం చాలా బాగుంది. 9 క్యారెట్ల బంగారంలో ఎంత బంగారం ఉంటుందా? దానిని ఎలా తయారు చేస్తారో తెలుసుకుందాం..9-క్యారెట్ బంగారం అంటే 24 భాగాలలో 9 భాగాలు మాత్రమే స్వచ్ఛమైన బంగారం. అంటే మీరు 9-క్యారెట్ బంగారు ఆభరణాలు తయారు చేసినప్పుడు అందులో 37.5% బంగారం ఉంటుంది. మిగిలిన 62.5% ఇతర లోహాలతో తయారు చేసి ఉంటుంది. మీ దగ్గర 9-క్యారెట్ బంగారు ఆభరణాలు 10 గ్రాములు ఉంటే ఆ బరువులో 3.75 గ్రాములు మాత్రమే స్వచ్ఛమైన బంగారం.



# నగరానికి అమృత్ 2.0లో రూ.135 కోట్లు మంజూరు

## క్రీడా హబ్ నగరం మారబోతోంది - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : అమృత్ పథకం ద్వారా నగరానికి మహర్దశ వచ్చిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) అన్నారు. అమత్ పథకం 2.0లో నగరాభివృద్ధి కోసం రూ.135 కోట్లు మంజూరయ్యాయని వెల్లడించారు. స్థానిక తిలక్ రోడ్డులోని రెడ్డీస్ కన్వెషన్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహా శివరాత్రిని పురస్కరించుకుని రానున్న పుష్కరాల నేపథ్యంలో తాము చేపట్టిన ఏఐ టెక్నాలజీ, క్రౌండ్ మేనేజ్మెంట్ వ్యవస్థలు మంచి ఫలితాలు ఇచ్చాయని, వీటిని ట్రైల్ రన్గా చేపట్టామన్నారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తుల ఇబ్బందులు లేకుండా గోదావరి స్నానాలు చేసి, ఆయా దేవాలయాల్లో స్వామివారి దర్శనం సునాయాసంగా చేసుకున్నారన్నారు. మొట్టమొదటి ఏఐ కెమెరాలు, చైల్డ్ ట్యాగింగ్ టెక్నాలజీతో ఘాట్ రద్దీని రియల్టైమ్లో మానిటర్ చేసి, పిల్లల ట్రేసింగ్ చేయడం జరిగిందని వివరించారు. ఇది ప్రారంభమేనని, తదుపరి పుష్కరాలకు రాజమండ్రిని అద్భుతంగా తీర్చిదిద్దుతామన్నారు.

**అమృత్ 2.0... 135 కోట్ల నిధులు :**

అమృత్ 2.0 కింద రాజమండ్రికి రూ. 135 కోట్లు కేటాయించబడ్డాయన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ 20 నెలల్లో రూ. 250 కోట్లు (సీఎస్ఆర్, ఎంపీ నిధులు, ఇతర నిధులు) నిధులతో నగరంలో అభివృద్ధి పనులు చేశామన్నారు. మరో రూ.140 కోట్ల పనులు సిద్ధంగా ఉన్నాయన్నారు. చరిత్రలో ఎవరూ చేయని విధంగా రికార్డు స్థాయిలో నిధులు తెచ్చి పనులు పూర్తి చేయడం మరో ఎత్తు అని ఆయన పేర్కొన్నారు.

**తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం :**

దశాబ్దాల తాగునీటి సమస్యలకు కొత్త పణాళికతో శాశ్వత పరిష్కారం చూపించబోతున్నామన్నారు. లా హాస్పిన్ వద్ద ఇంటేక్ వెల్, కొటిలింగలపేట ఫిల్టరేషన్ ప్లాంట్, ఈఎల్ఆర్ఎస్ ట్యాంకులు నిర్మాణం, కొటిలింగలపేట, సారంగధర మెట్ట, వెంకటేశ్వరనగర్లో ట్యాంకులు నిర్మాణం చేస్తామన్నారు. ఇకపై హై ప్రెషర్తో ప్రతి ఇంటికి సమృద్ధిగా మంచినీటి సరఫరా చేస్తామన్నారు.

**క్రీడల అభివృద్ధి... ఇండోర్ స్టేడియం :**

ఖేలో ఇండియా కింద సుమారు రూ. 14 కోట్లతో నగరంలో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపడుతున్నామన్నారు. రానున్న మూడేళ్లలో పూర్తి ఈ స్టేడియం నిర్మాణం పూర్తవుతుందన్నారు. 175 నియోజకవర్గాల్లో ఒక ఐకానిక్ నగరంగా రాజమహేంద్రవరం నగరాన్ని తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్.

**వైఎస్సార్సీపీపై తీవ్ర విమర్శలు :**

విజనరీ సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి అభివృద్ధి వైపునకు నడిపిస్తుంటే వైకాపా దానిని అడ్డుకోవాలని చూస్తోందని, అది ఎప్పటికీ సాధ్యంకాదన్నారు. బడ్జెట్ సభల్లో మర్యాదలు మరచి, గవర్నర్ ముందు పేపర్లు చింపి వెళ్లడం ప్రజాస్వామ్య అపహాస్యం చేసినట్టేనన్నారు. ప్రతిపక్షం బలహీనత, సింగిల్ లీడర్ డామినేషన్ (పెద్దిరెడ్డి, బొత్సాలను ఉద్దేశించి) వైకాపాలో బాగా కనిపిస్తోందన్నారు. ఈ నెల 11వ తేదీన వైకాపా ఎమ్మెల్యేలు 11 మంది 11 గంటలకు అసెంబ్లీకి వచ్చి కరెక్టుగా 11 నిమిషాలు ఉండి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు.

**గ్రాండ్ విజన్... రూ. 1000 కోట్ల ప్లాన్ :**

రానున్న మూడేళ్లలో రూ.1000 కోట్ల పనులు... రివర్ బ్యాంక్ నుంచి ప్రతి గల్లీకి వెలుగులు నింపడం, గత పాలకులు నాశనం చేసిన రాజమండ్రిని అద్భుత నగరంగా మారుస్తామన్నారు. "అభివృద్ధి అంటే ఇలా... ప్రజలకు భరోసా అంటే ఇది అనేలా తమ భవిష్యత్తు ప్రణాళికలు ఉండబోతున్నాయని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు.

**ప్రజల జీవితాల్లో మార్పు వచ్చేలా బడ్జెట్ :**

ప్రజల జీవితాల్లో నిజమైన మార్పు వచ్చేలా బడ్జెట్ ఉందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర భవిష్యత్కు స్పష్టమైన దశ, దిశను చూపే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ప్రజల ఆశలకు, ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. బడుగు బలహీల వర్గాల అభివృద్ధే లక్ష్యంగా, వ్యవసాయం, పారిశ్రామిక, సాగునీటి, విద్య, వైద్యం, టూరిజం, పంచాయతీ రాజ్, మహిళ సంక్షేమం రంగాలను బలోపేతం చేసే విధంగా బడ్జెట్ ఉందని, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. మీడియా సమావేశంలో కూటమి నాయకులు కుడుపూడి సత్తిబాబు, కాశీ నవీన్ కుమార్, వర్రే శ్రీనివాసరావు, రెడ్డి మణేశ్వరరావు, కంటిపూడి శ్రీను, కొయ్యల రమణ, శెట్టి జగదీష్, బుడ్డిగ రవి, తవ్వ రాజా, తంగెళ్ళ బాబీ, ఉప్పులూరి జానకిరామయ్య, కంటిపూడి రాజేంద్రప్రసాద్, బుడ్డిగ గోపాలకృష్ణ, కదలి రామకృష్ణ, ద్వారా పార్వతి సుందరి, జవ్వాది మురళి, అగురు ధన్ రాజ్, బేసరి చిన్ని, దాస్యం ప్రసాద్, దుత్తరపు గంగాధర్, సలాది ఆనంద్, చింతపల్లి నాని, కురగంటి సతీష్, అడబాల రామకృష్ణ, రాజేష్ కన్నా, చొప్పర్ల వీరభద్రరావు, వింజరాపు శంకర్, రత్న రెడ్డి, కానేటి ప్రభు, కానేటి కృప, మదినా సాహెబ్ పాల్గొన్నారు.

# హిందువులను మానసిక క్షోభకు గుర్తిస్తున్న చంద్రబాబు

## తిరుమల లడ్డుపై చేసిన కుట్ర భగ్నమైంది - బోలె బాబా డైరీకి అనుమతులు ఇచ్చినది చంద్రబాబే..

## మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విమర్శ




రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందని హరి భక్తులను మానసిక క్షోభకు గురి చేసేందుకు కూటమి ప్రభుత్వం పదేపదే ప్రచారం చేస్తుందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు, మాజీమంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆరోపించారు. సోమవారం రాజమండ్రి రూరల్ బొమ్మూరులో గల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైందవ భక్తుల్ని జగన్ కు రాజకీయం గా దూరం చేయడానికి అసత్య ప్రచారాలు చేస్తుందని పేర్కొన్నారు. కుల మత రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ లు ప్రయత్నిస్తున్నారని అన్నారు. పిఠాపురంలో తిరుమల లడ్డు కల్తీ జరిగిందంటూ పోస్టర్ విడుదల చేశారని తెలిపారు. గతంలో విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా గుంటూరులో పాస్టర్ విడుదల చేశారని అన్నారు. చట్టాన్ని రక్షిస్తానని రాజ్యాంగ బద్ధంగా ప్రమాణం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు తిడితే జైల్లో పెట్టారని, వారిపై దాడి చేసి కొట్టిన వారికి బెయిల్ ఇచ్చారని, తిడితే జైలు కొడితే బెయిల్ లా అని ప్రశ్నించారు. ప్రజాస్వామిక ప్రేమికులు కూటమి విధానాలను ఆలోచించాలని అన్నారు. అధికారంలో ఉన్నాము కదా మాకు మాత్రమే చట్టాలు వర్తిస్తాయన్నట్లు కూటమి నాయకులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కలియుగ ప్రత్యక్ష దైవం, కోట్లాదిమంది భక్తులు సేవించి తరించే ప్రసాదంలో కల్తీ జరిగిందని అసత్య ఆరోపణలు చేస్తూ భక్తుల మనోభావాలను క్షోభకు గురి చేశారని అన్నారు. ఈ నిందను గత ప్రభుత్వం పై నెట్టివేసి రాజకీయ లబ్ధి పొంది ఎందుకే కూటమి నాయకులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. చంద్రబాబు ఒక వేలు చూపిస్తే 4 వేళ్ళు ఆయన వైపే చూపిస్తున్నాయని తెలిపారు. మామ ఎన్టీఆర్కు వెన్నుపోటు పొడిచి పదవి నుంచి తప్పించిన చంద్రబాబు శ్రీమన్నారాయణ తో పెట్టుకున్నాడని ఒక్కొక్కటిగా వాస్తవాలు బయటపడుతున్నాయని వివరించారు. చంద్రబాబు అధికారంలో ఉండగానే నెయ్యి సరఫరాకు టెండర్లు పిలిచారని అన్నారు. ఆయన అధికారంలో ఉండగా నాలుగు కల్తీ నెయ్యి ట్యాంకర్లను తిప్పి పంపాలని వాటిని మరలా లడ్డు తయారీలో వినియోగించారని తెలిపారు. బోలే బాబా డైరీ కి ద్వారాలు తెరిచింది చంద్రబాబునాయుడు అని తెలిపారు. ఆయన హయాంలో కేజీ నెయ్యిని రూ 320, 321 ధరలకు కొనుగోలు చేసినట్లు వివరించారు. తిరుమల లడ్డుపై చేసిన కుట్ర బయటపడుతుందని ప్రజలు గమనించారని అన్నారు. లడ్డులో కల్తీ జరగలేదని జాతీయ దర్యాప్తు సంస్థలు తెలిపాయని అన్నారు. మీరు అధికారంలో ఉండగా సిట్ సంస్థ తో విచారణ జరిపారని, ఆ సంస్థ మీరు సిట్ అంటే సిట్, స్టాండ్ అంటే స్టాండ్ గా వ్యవహరిస్తుందని అన్నారు. 2018లో ఏఆర్ డైరీ పరిశీలించి అనుమతి ఇచ్చింది టిడిపి ప్రభుత్వం ఆరోపించారు. తిరుమల లడ్డుపై చాలా పెద్ద ఆభాండ వేసారని కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# తోలత్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్లో ఐసీయూ వైద్య విభాగాలు ప్రారంభం

## అన్ని రకాల వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో..



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రజలకు ఒకే చోట అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండడం హర్షనీయమని రాజమండ్రి కిమ్స్ హాస్పిటల్స్ కార్డియో థొరాసిక్, వాస్కులర్ సర్జన్ డాక్టర్ ఎం.ఎస్. సతీష్, రాజమండ్రి శ్రీహిత హాస్పిటల్స్,ప్రముఖ పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ వై. ఎస్.గురుప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం రాజమండ్రి భాస్కర్ నగర్ లోని తోలత్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ లో వివిధ విభాగాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఐసియు ఇతర విభాగాలను హాస్పటల్లో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ రాజమహేంద్ర వరం ప్రజలకు నాణ్యమైన, సమగ్ర మల్టీ స్పెషాలిటీ వైద్య సేవలు ఒకే చోట అందుబాటులోకి రావడం ఆనందదాయకమని అన్నారు. గుండె సంబంధిత వ్యాధులకు, న్యూరాలజీ, నెఫ్రాలజీ, గైనిక్, ఆర్థోపెడిక్, తదితర వ్యాధులకు చికిత్స అందించేందుకు అనుభవజ్ఞులైన డాక్టర్ల అందుబాటులో ఉన్నారని తెలిపారు. అత్యాధునిక సదుపాయాలతో కూడిన ఐసీయూ విభాగం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో రోగులకు తక్షణ చికిత్స అందించగలమని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం వర్తిస్తుందని, అర్హులైన రోగులు ఈ సేవలను వినియోగించు కోవచ్చని డాక్టర్లు తెలిపారు. నగర ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలను అందించాలనే లక్ష్యంతో హాస్పిటల్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ పి. జాహ్నవి, హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





### ఎంపీ పురందేశ్వరిని

# కలిసిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : స్థానిక జెఎన్ రోడ్డు వెంకటేశ్వనగర్లోని క్యాంపు కార్యాలయంలో ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి ని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సోమవారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం అభివృద్ధికి అమృత్ 2.0 కింద రూ. 135 కోట్లు...నగరాన్ని క్రీడా హబ్ మార్చేందుకు ఖేలో ఇండియాలో భాగంగా రూ.13 కోట్ల 76 లక్షలు మంజూరు చేయించినందుకు ఎంపీ పురంధేశ్వరి కి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. 2027లో జరగనున్న పుష్కరాలు సజావుగా జరిగేందుకు ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేయాలి, నిధులు ఏ విధంగా తీసుకురావాలన్న అంశాలపై ఈ సందర్భంగా ఆ ఇరువురు చర్చించుకున్నారు. అలాగే నగరంలో మిగిలిన మిగతా రెండు స్పోర్ట్స్ 7 కాంప్లెక్సెస్ కూడా ఏ విధంగా పూర్తి చేయాలన్న విషయమై ఎంపీ పురంధేశ్వరి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వారుకి పలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఆదివారం శివరాత్రి సందర్భంగా వినియోగించిన సాంకేతికి పరిజ్ఞానం పట్ల ఆమె అభినందనలు తెలిపారు.

# ప్రైవేట్ స్కూళ్ళలో ఉచిత ప్రవేశాలు దరఖాస్తు చేసుకోండి

**- పేస్ప అధ్యక్షుడు కొమ్ము సత్తిబాబు**



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆర్.టి.ఈ 12(1) సి ఒకటో తరగతిలో 25 శాతం,ప్రైవేట్ ఉచిత కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది అనే విషయం విధితమే, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అన్ని జిల్లాలలోని అర్హులైన పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఉచిత విద్య విద్యార్థుల తల్లితండ్రుల సంఘ అధ్యక్షుడు కొమ్ము సత్తిబాబు కోరారు. ఈ ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2020 జూన్ 2 నుంచి 2021 మే 31 మధ్య జన్మించి ఉండాలి. విద్యార్థులు తమ నివాస ప్రాంతానికి సమీపంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలను ఎంచుకుని దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తి గల తల్లిదండ్రులు ఫిబ్రవరి 20 వ తేదీ నుంచి మార్చి 10వ తేదీ వరకు ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకోవలెను. మార్చి 25న మొదటి విడత సీట్ల కేటాయింపు ఉంటుంది. ఈ ప్రక్రియలో ఏవైనా సందేహాలుంటే 9912352915,9390140007 మా ఫెస్ప సంస్థ ద్వారా అన్ని లోని విద్యార్థులకు ఉచితంగా ఆన్లైన్ చేయబడును. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలనీ అని అన్నారు.

# జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులుగా చింతా తమ్మిరెడ్డి

**పదేళ్ళుగా మండలంలో భాజపా బలోపేతానికి కృషి**

**1986 నుండి పలు సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలలో గుర్తింపు**

**మండల బిజెపి నాయకుల అభినందన శుభాకాంక్షలు**





రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ : మండలంలో పదేళ్ళుగా భారతీయ జనతాపార్టీ బలోపేతానికి కృషి చేసిన చింతా తమ్మిరెడ్డి సేవలను గుర్తించిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధిష్టానం ఆయనను జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షులుగా ప్రకటించడం హర్షించదగ్గ విషయమని రాయవరం మండలం భారతీయ జనతా పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం ప్రకటన ద్వారా చింతా తమ్మిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ విధి, విధానాలుకు ఆకర్షితులై 2014వ సంవత్సరంలోనే పార్టీలో చేరిన తమ్మిరెడ్డి రాయవరం మండల అధ్యక్షులుగా సేవలందించారని, అవినీతి,అక్రమాలపై పోరాడుతూ మండలంలో పార్టీ మరింత బలపడడంలో కీలక పాత్ర పోషించారన్నారు. తూర్పుగోదావరి జిల్లా, రాయవరం మండలం, పసలపూడి గ్రామానికి చెందిన చింతా తమ్మిరెడ్డి స్వగ్రామమైన పసలపూడి గ్రామంలో 1986 సంవత్సరంలో చైతన్య కళా స్రవంతి యూత్ అసోసియేషన్ అనే సంస్థను స్థాపించి, స్థానిక యువత కు నైపుణ్య శిక్షణ అందించారని గుర్తు చేశారు. యువత శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పడే విధంగా కబాడీ ,బ్యాడ్మింటన్, చదరంగం, జానపద, సంస్కృతిక వంటి అనేక పోటీలు నిర్వహించి ప్రోత్సాహం అందించారన్నారు. ఆ రోజుల్లోనే తక్కువ వ్యయంలో దొరికే బయోగ్యాస్, సోలార్ పై అవగాహన కల్పించి, ఉచిత కంప్యూటర్ శిక్షణ అందించడం ఆయన ముందు చూపుకు నిదర్శనమన్నారు. అలాంటి వ్యక్తి ని జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బిజెపి అధ్యక్షులు అడబాల సత్యనారాయణ ప్రకటించడం హర్షణీయమని, దేశానికి వెన్నుముక అయిన రైతులకు ఆయన సేవలు ఎంతగానో ఉపయోగపడతాయని కొనియాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి రైతుకూ చేరేలా చేయడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని నమ్మకం వ్యక్తం చేస్తూ రాయవరం మండల బిజెపి అధ్యక్షులు శాఖ దుర్గా శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు చాట్రాతి జానకి రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు కొత్తపల్లి శ్రీదేవి, చిరట్ల సుబ్బారావు, అంగర జనార్ధన స్వామి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితర పార్టీ శ్రేణులు తమ్మి రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తనపైన నమ్మకంతో విలువైన బాధ్యతలను అప్పగించిన జిల్లా అధిష్టానం నమ్మకాన్ని నిలబెడతానని, భాజపా బలోపేతానికి మరింత కృషి చేస్తానని కృతజ్ఞతలు తెలియజేస్తూ చింతా తమ్మిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.

### అంతర్జాతీయ స్పోర్ట్స్ సైన్స్ కాన్ఫరెన్స్లో పాల్గొన్న

# రాయవరం వ్యాయామ ఉపాధ్యాయులు అజ్జిబాబు

**ఫిబ్రవరి 12 నుండి 14 వలకూ జరిగిన సమావేశాలు**

**గోవాలో జరిగిన సమావేశానికి రాయవరం ఉపాధ్యాయునికి ఆహ్వానంపై సర్వత్రా హర్షం**



రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ : అంతర్జాతీయ స్పోర్ట్స్ సైన్స్ సమావేశానికి తూర్పుగోదావరి జిల్లా మండల కేంద్రమైన రాయవరంలో గల శ్రీ రామయ్య జిల్లా పరిషత్ వ్యాయామ అధ్యాపకులు చిక్కాల అజ్జిబాబు హాజరవడం గర్వకారణం అని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విప్పర్తి శాంతి సునీత పేర్కొన్నారు. ఫిబ్రవరి 12 నుండి 14 వరకు గోవాలోని రోజరీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్ నవేలి లో నిర్వహించారని, రీసెర్చ్ ప్రొఫెసర్ పి పి ఎస్ పాల్ కుమార్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గుంటూరు వీరీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి అంతర్జాతీయ స్పోర్ట్స్ కాన్ఫరెన్స్ ఆన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఆంధ్రప్రదేశ్ నుండి పదిమంది సభ్యులతో కూడిన బృందం గోవా వెళ్ళిందన్నారు. మూడు రోజులు సదస్సులో 15 దేశాలకు చెందిన ఫిజికల్ ఎడ్యుకేషన్ నిపుణులు హాజరయ్యారన్నారు. ద రోల్ ఆఫ్ స్పైక్ అండ్ సైకలాజికల్ ఫ్యాక్టర్స్ ఇన్ పర్ఫామెన్స్ ఆఫ్ స్కూల్ లెవెల్ వాలీబాల్ ప్లేయర్స్ స్పైక్ అనే టాపిక్ పై రీసెర్చ్ పేపర్ ను గోవా అంతర్జాతీయ స్పోర్ట్స్ కాన్ఫరెన్స్లో అజ్జిబాబ సమర్పించారని, సమావేశం ముగించుకుని వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు అజ్జిబాబు ను పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు వి శాంతి సునీత, డి వై ఇ వో పత్తి రామ లక్ష్మణమూర్తి, ఎం ఈ ఓ వై సూర్య నారాయణ ఏ ఎం ఓ పిల్లి రాంబాబు స్కూల్ చైర్మన్ డి.కోటేశ్వరరావు లు తోటి ఉపాధ్యాయులు సోమవారం ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## సినీ వాయిస్ CINEMA

# విజయ్ దేవకొండ, రష్మిక పెళ్లి డేట్ ఫిక్స్..



అనుకున్నట్టు గానే విజయ్ దేవకొండ, రష్మిక పెళ్లి చేసుకోబోతున్నారు. విజయ్ దేవరకొండ – రష్మిక మందన్న పెళ్లి పత్రిక వైరల్ అవుతుంది. పెళ్లికి అతిథులను ఆహ్వానిస్తున్నారు విజయ్ దేవకొండ, రష్మిక జంట. వీరి వివాహం ఫిబ్రవరి 26న గ్రాండ్ గా జరగనుంది. అనుకున్నట్టు గానే విజయ్ దేవకొండ, రష్మిక పెళ్లి చేసుకోబోతున్నారు. విజయ్ దేవరకొండ –రష్మిక మందన్న పెళ్లి పత్రిక వైరల్ అవుతుంది. పెళ్లికి అతిథులను ఆహ్వానిస్తున్నారు విజయ్ దేవకొండ, రష్మిక జంట. వీరి వివాహం ఫిబ్రవరి 26న గ్రాండ్‌గా జరగనుంది. అత్యంత సన్నిహితుల మధ్య విజయ్ దేవకొండ, రష్మిక పెళ్లి జరగనుందని తెలుస్తుంది. కాగా మార్చి 4న తాజ్ కృష్ణలో రిసెప్షన్ ఏర్పాటు చేయనున్నారు. గత కొంతకాలంగా ప్రేమలో తేలిపోతున్న విజయ్, రష్మిక ఇప్పుడు వివాహబంధంతో ఒక్కటి కాబోతున్నారు. నెట్టింట వీరి పెళ్లి వార్తలు తెగ చక్కర్లు కొడుతున్నాయి. ఇటీవలే వీరిద్దరికి ఎంగేజ్‌మెంట్ అయినట్లు వార్తలొచ్చాయి. అయితే ఈ విషయంలో ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటనైతే రాలేదు. కానీ రష్మిక, విజయ్ చేతులకు ఎంగేజ్మెంట్ రింగ్స్ ఉన్నాయని, త్వరలోనే పెళ్లిపీటలెక్కనున్నారని ఫ్యాన్స్ తెగ సంతోషపడిపోయారు. ఇప్పుడు ఏకంగా వీరి పెళ్లి పత్రిక వైరల్ అవుతుంది. ఫిబ్రవరి 26న వీరి వివాహం కొంతమంది కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య జరుగనుంది. ఆతర్వాత హైదరాబాద్ లో గ్రాండ్ గా రిసెప్షన్ జరగనుందని తెలుస్తుంది.

# క్యూట్ క్యూట్ ఫొటోలతో మతిపోగొడుతున్న కృతి శెట్టి..

### చూపు తిప్పుకోలేకపోతున్న కుర్రాళ్లు

ఉప్పెన సినిమాతో ఓవర్ నైట్‌లో స్టార్ అయ్యింది అందాల భామ కృతిశెట్టి. తొలి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకుంది. అలాగే తన నటనతో అందంతో ప్రేక్షకులను కవ్వించింది ఈ చిన్నది. ఆ తర్వాత వరుసగా ఆఫర్స్ అందుకుంది. ఉప్పెన సినిమా తర్వాత కృతిశెట్టి శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు చిత్రాలతో హిట్స్ అందుకుంది. ఉప్పెన సినిమాతో ఓవర్ నైట్‌లో స్టార్ అయ్యింది అందాల భామ కృతిశెట్టి. తొలి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకుంది. అలాగే తన నటనతో అందంతో ప్రేక్షకులను కవ్వించింది ఈ చిన్నది. ఆ తర్వాత వరుసగా ఆఫర్స్ అందుకుంది. ఉప్పెన సినిమా తర్వాత కృతిశెట్టి శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు చిత్రాలతో హిట్స్ అందుకుంది. దాంతో టాలీవుడ్ లో లక్కీ హీరోయిన్‌గా మారిపోయింది ఈ చిన్నది. కానీ ఆ తర్వాత ఈ బ్యూటీ నటించిన సినిమాలన్నీ అట్టర్ ఫ్లాప్ అయ్యాయి. దీంతో తెలుగులో ఆమెకు అవకాశాలు తగ్గిపోయాయి. ప్రస్తుతం తమిళంలో అవకాశాలు అందుకుంటుంది. ఈ ముద్దుగుమ్మ 2003 సెప్టెంబరు 21న కర్ణాటకలోని మంగళూరులో జన్మించింది, ముంబైలో పెరిగింది. ఆమె తండ్రి కృష్ణ శెట్టి వ్యాపారవేత్త, తల్లి నీతి శెట్టి ఫ్యాషన్ డిజైనర్. చిన్నతనం కృతి శెట్టి ఐడియా, షాపర్స్ స్టాప్, పార్లే, లైఫ్‌బాయ్ వంటి పలు బ్రాండ్‌ల వాణిజ్య ప్రకటనల్లో నటించింది. ఇక ఈ ముద్దుగుమ్మ తన కెరీర్ ను చైల్డ్ ఆర్టిస్ట్ గా ఇండస్ట్రీకి పరిచయం అయ్యింది. కృతి 2019లో హిందీ చిత్రం సూపర్ 30లో చిన్న పాత్రతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. సోషల్ మీడియాలో ఈ బ్యూటీ షేర్ చేసే ఫోటోలకు నెట్టింట మంచి క్రేజ్ ఉంది. ఆమె ఫోటోలకు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. ఈ మధ్య గ్లామర్ డోస్ పెంచి ఫోటోలను షేర్ చేస్తుంది ఈ అందాల తార.



## క్రీడా వాయిస్

# వచ్చాడయ్యా పెద్ద పోటుగాడు..! ఆఫ్రిదికి అధికారం ఉంటేనట..





టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా కొలంబో వేదికగా జరిగిన హై-వోల్టేజ్ మ్యాచ్‌లో భారత్ చేతిలో పాకిస్థాన్ 61 పరుగుల తేడాతో ఘోర పరాజయం పాలైంది. ఈ ఓటమి కేవలం ఒక మ్యాచ్ ఫలితం మాత్రమే కాదు, పాక్ క్రికెట్ పునాదులను కదిలించేలా ఉంది. టీమిండియా నిర్దేశించిన 176 పరుగుల లక్ష్య ఛేదనలో పాక్ బ్యాటర్లు చేతులెత్తేయడంపై ఆ దేశ మాజీ క్రికెటర్లు నిప్పులు చెరుగుతున్నారు. బాబర్ అజామ్, షాహీన్ అఫ్రిది వంటి దిగ్గజాలపై తీవ్ర విమర్శలు రావడమే కాకుండా, వారిని జట్టు నుంచి శాశ్వతంగా తప్పించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ అఫ్రిది ఈ ఓటమిపై స్పందిస్తూ చాలా కఠినమైన వ్యాఖ్యలు చేశారు. “జట్టు ఎంపికలో నా చేతిలో అధికారం ఉంటే బాబర్ అజామ్, షాదాబ్ ఖాన్, షాహీన్ అఫ్రిదిలను వెంటనే జట్టు నుంచి తప్పించేవాడిని. వారికి ఇప్పటికే చాలా అవకాశాలు ఇచ్చాం, కానీ కీలక సమయాల్లో వారు పదేపదే విఫలమవుతున్నారు. సీనియర్లు ఫలితాలను ఇవ్వనప్పుడు, బెంచ్‌పై ఉన్న యువకులను ఎందుకు ఆడించకూడదు?” అని ప్రశ్నించారు. బాబర్ అజామ్ జట్టుకు భారంలా మారాడనే అర్థం వచ్చేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయి. పాక్ క్రికెట్ దిగ్గజం జావెద్ మియాందాద్ మాట్లాడుతూ.. పెద్ద మ్యాచుల్లో ఆటగాళ్లకు ఉండాల్సిన క్యారెక్టర్ పాక్ క్రికెటర్లలో కనిపించలేదన్నారు. టీమ్ మేనేజ్మెంట్ తీసుకున్న ఆరుగురు స్పిన్నర్ల నిర్ణయం కూడా ఘోర తప్పిదమని ఎత్తిచూపారు. మరో మాజీ కెప్టెన్ మహ్మద్ యూసుఫ్ అయితే.. పాక్ క్రికెట్‌లో రాజకీయ జోక్యం, వ్యక్తిగత ఎజెండాల వల్లే ఈ దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. బలహీనమైన జట్లపై గెలిచి గొప్పలు చెప్పుకోవడం కాదు, భారత్ వంటి జట్లపై ఆడినప్పుడే అసలు సత్తా తెలుస్తుంది. షాహీన్, బాబర్‌ల సమయం ముగిసింది అని ఆయన ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు. రావల్పిండి ఎక్స్‌ప్రెస్ షోయబ్ అక్తర్ ఎప్పటిలాగే తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. బాబర్ అజామ్‌ను విరాట్ కోహ్లీతో పోల్చడంపై మండిపడుతూ.. కోహ్లీ తన వారసత్వాన్ని తానే నిర్మించుకున్నాడు. కానీ బాబర్ మాత్రం ఒక్క మ్యాచ్ కూడా గెలిపించలేకపోతున్నాడు. మీరు ఒక సూపర్ స్టార్?ను తయారు చేశారు, కానీ అతడికి మ్యాచ్ గెలిపించే సత్తా లేదని దుయ్యబట్టారు. పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీని కూడా అసమర్థుడు అని అక్తర్ అభివర్ణించడం గమనార్హం. పాక్ క్రికెటర్ అహ్మద్ షెహజాద్ కూడా బాబర్ అజామ్ ప్రదర్శనపై పెదవి విరిచారు. భారత్‌పై బాబర్ మరోసారి అట్టర్ ఫ్లాప్ అయ్యాడు. బహుశా టీ20 ఫార్మాట్‌లో బాబర్‌కు ఇదే చివరి మ్యాచ్ కావచ్చేమో అని సోషల్ మీడియాలో పేర్కొన్నారు. వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న బాబర్‌ను జట్టులో కొనసాగించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

# వరల్డ్ నంబర్ 1 బ్యాటర్‌కు ఏమైంది? అనారోగ్యం కారణంగా పంజాబ్ గబ్బర్ ఫామ్ పోయిందా ?



టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా ఘనవిజయాలతో దూసుకుపోతున్నా, స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్ ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. టోర్నీకి ముందు ప్రపంచ నంబర్ 1 టీ20 బ్యాటర్‌గా, భారత జట్టులో అత్యంత ప్రమాదకరమైన ఆటగాడిగా ముద్రపడ్డ అభిషేక్, ప్రస్తుతం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నాడు. గత ఆరు టీ20 ఇన్నింగ్స్‌ల్లో అతను ఏకంగా నాలుగు సార్లు సున్నా (డకౌట్) పరుగులకే వెనుదిరగడం గమనార్హం. ఈ టోర్నీలో అభిషేక్ శర్మ ప్రయాణం ఏమంత సాఫీగా సాగడం లేదు. మొదటి మ్యాచ్‌లో యూఎస్ఏ పై డకౌట్ అయిన తర్వాత, అతను తీవ్రమైన కడుపు ఇన్ఫెక్షన్‌తో ఢిల్లీలోని ఆసుపత్రిలో రెండు రోజుల పాటు చేరాల్సి వచ్చింది. దీనివల్ల నమీబియాతో జరిగిన మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఆదివారం కొలంబోలో పాకిస్థాన్‌తో జరిగిన కీలక పోరులో కోలుకుని బరిలోకి దిగినప్పటికీ, కేవలం 4 బంతులే ఆడి మళ్ళీ సున్నాకే అవుట్ అయ్యాడు. దీంతో టీ20 ప్రపంచకప్‌లో ఆడిన మొదటి రెండు మ్యాచ్‌ల్లోనూ డకౌట్ అయిన తొలి భారత బ్యాటర్‌గా అభిషేక్ అన్ వాంటెడ్ రికార్డును మూటగట్టుకున్నాడు. అభిషేక్ ఫామ్‌పై విమర్శలు వస్తున్నప్పటికీ, మాజీ కోచ్ రవిశాస్త్రి అతనికి మద్దతుగా నిలిచారు. “అభిషేక్ శర్మ ఒక క్వాలిటీ ప్లేయర్. ఇలాంటి ఫేజ్ ఎవరికైనా వస్తుంది. అతను క్రీజులో కొంచెం సమయం గడిపితే చాలు, మళ్ళీ పాత ఫామ్‌లోకి వస్తాడు. ఒక్కసారి అతను కుదురుకుంటే బౌండరీల వర్షం కురిపించడం అతనికి పెద్ద కష్టం కాదు” అని శాస్త్రి పేర్కొన్నారు. అభిషేక్ విఫలమైనా, మరో ఓపెనర్ ఇషాన్ కిషన్ (77 పరుగులు) వీరవిహారం చేయడంతో భారత్ పాక్‌పై 61 పరుగుల భారీ విజయాన్ని సాధించింది. భారత్ తన తదుపరి లీగ్ మ్యాచ్‌ను బుధవారం (ఫిబ్రవరి 18) అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో నెదర్లాండ్స్‌తో ఆడనుంది. సూపర్-8 దశకు ముందు అభిషేక్ శర్మ తన ఫామ్‌ను తిరిగి పొందేందుకు ఇదొక చక్కని అవకాశం. ఈ మ్యాచ్‌లో అతను రాణిస్తే టీమిండియాకు ఓపెనింగ్ సమస్య తీరినట్టే.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్ CINEMA
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com